

	గరిష్టం	కనిష్టం
ఖమ్మం	40.3	25.9
భద్రాద్రి	36.0	26.0



ప్రతి సంవత్సరం వర్షాకాలం, వరదల సమయం వచ్చిందంటే గోదావరి నదీ పరివాహక ప్రాంతవాసుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. గోదావరి 53 అడుగులు (చివరి ప్రమాద హెచ్చరిక) దాటి ప్రవహించిందంటే ఏజెన్సీలోని నదీ పరివాహక ప్రాంతవాసులకు గుండెల్లో అలజడి మొదలవుతుంది. గత కొన్నేళ్లుగా జూలైలోనే గోదావరి తన ఉగ్రరూపాన్ని చూపుతోంది. 2022 జూలై 16న భద్రాచలం వద్ద గోదావరి 71.3 అడుగులు గరిష్ట నీటిమట్టం నమోదు కాగా గత 32 ఏళ్లల్లో ఇదే అత్యధిక నీటిమట్టంగా రికార్డయ్యింది. ఈ క్రమంలో నదీ పరివాహక ప్రాంతంలోని భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, బూర్గంపాడు మండలాలు అతలాకుతలమయ్యాయి. గతేడాది జూలై 30న భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 56.1 అడుగులు నమోదైంది. ఈసారి మళ్లీ గోదావరి వరదల సీజన్ సమీపిస్తుండటంతో ఏజెన్సీవాసుల్లో దడ మొదలైంది. ఈ నేపథ్యంలో గురువారం కొత్తగూడెం కలెక్టరేట్‌లో గోదావరి వరదల ముందస్తు ఏర్పాట్లపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్షించనున్నారు.

ఎన్నాళ్లీ కన్నీటి వ్యథ?

గోదావరి పరివాహక ప్రజలకు ఏటా ముంపు బెడద

- ఏజెన్సీలో అతలాకుతలం అవుతున్న జనజీవనం
- భద్రాద్రి రామభక్తులకూ తప్పని అవస్థలు
- వరదలపై నేడు మంత్రుల ముందస్తు సమీక్ష
- శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజల వేడుకోలు

భద్రాచలం, జూన్ 26: ఒక సారి కాదు.. రెండుసార్లు కాదు ప్రతి ఏటా జూలై, ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో భద్రాద్రి ఏజెన్సీవాసులకు గోదావరి ముంపు బెడద తప్పడం లేదు. గోదావరి 60 అడుగులు దాటి ప్రవహిస్తే ప్రధాన రహదారులపై రాకపోకలు నిలిచిపోవడమే కాకుండా జనజీవనం స్తంభిస్తుంది. ఈ క్రమంలో అధికార యంత్రాంగం ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో ముందస్తుగా బియ్యం, పెట్రోలు, డీజిల్, నూనె, కందిపప్పుతోపాటు ఇతర నిత్యావసర సామగ్రిని బఫర్‌స్టాక్‌గా నిల్వ ఉంచాల్సి ఉంటుంది.

కరకట్ట రివిట్‌మెంట్‌పై దృష్టిసారించాలి

భద్రాచలంలోని కరకట్టకు విస్తాకాంప్లెక్స్, ఇతర స్లూయిస్‌ల వద్ద ఉన్న రివిట్‌మెంట్‌పై అధికారులు దృష్టిసారించాలి. ఎందుకంటే 2022 జూలై 16న వచ్చిన గోదావరి మహోగ్రరూపంతో 71.3 అడుగులు దాటి ప్రవహించడంతో ఆ సమయంలో కరకట్ట ప్రాంతంలో కొన్నిచోట్ల రివిట్‌మెంట్ దెబ్బతినడంతో ఆ సమయంలో అధికారులు ఇసుక బస్తాలను వేసి తాత్కాలిక మరమ్మతులు చేశారు. కానీ అనంతరం రెండేళ్లుగా ఈ విషయంపై దృష్టిసారించకపోవడంతో సమస్యకు పరిష్కారం లభించలేదు.

ముందస్తు అప్రమత్తతే కీలకం

వానాకాలంలో సీజన్‌లో వరద తీవ్రతను ముందస్తుగా గుర్తించి అధికార యంత్రాంగం ముంపు ప్రాంతాల వారిని అప్రమత్తం చేయడం ఎంతో కీలకం. భద్రాద్రి జిల్లాలోని కీలక అధికారులైన కలెక్టర్, ఐటీడీఏ పీవో, భద్రాచలం ఆర్డీవోలు ఇటీవలే బాధ్యతలు చేపట్టడంతో వారికి ఇదే తొలి వరదల సీజన్ కానుంది. ఈ క్రమంలో సీనియర్ అధికారులు ముందస్తుగానే వారికి పరిస్థితిపై అవగాహన కల్పించి అందుకనుగుణంగా చర్యలు చేపట్టాల్సి ఉంది. గోదావరి ఫ్లడ్ మాన్యువల్ ఆధారంగా వరద పరిస్థితిని పూర్తిగా అంచనా వేసేందుకు వెసులుబాటు ఉంది.

చిరు వ్యాపారుల కష్టాలు తీరేదెన్నడు..

వర్షం వచ్చినా, వరదొచ్చినా తొలుత నష్టపోతున్నది భద్రాచలంలోని చప్టా దిగువ చిరు వ్యాపారులే..

(మిగతా 6వ పేజీలో)





కొత్తగూడెంలో నేడు డిప్యూటీ సీఎం పర్యటన

- ముగ్గురు మంత్రులతో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- గోదావరి వరదలపై కలెక్టరేట్‌లో ముందస్తు సమీక్ష

6



సకిని రామచంద్రయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

పద్మశ్రీ 'సకిని' కుటుంబానికి మంత్రి తుమ్మల పరామర్శ

- ఇంటి స్థలం, ఇల్లు ఏర్పాటుపై ఫోన్‌లో కలెక్టర్‌కు ఆదేశాలు
- గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు మరిచిందని విమర్శ

మణుగూరుటౌన్, జూన్ 26: పద్మశ్రీ అవార్డుగ్రహీత దివంగత సకిని రామచంద్రయ్య కుటుంబ సభ్యులను బుధవారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శిచారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మలను చూసి రామచంద్రయ్య కుటుంబసభ్యులు ఒక్కసారిగా కన్నీటి పర్యంతమయ్యారు. తాము ఎదుర్కొంటున్న కష్టాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన మంత్రి తుమ్మల రామచంద్రయ్య కుటుంబ సభ్యులను ఓదార్చి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వెంటనే భద్రాద్రి జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి పద్మశ్రీ సకిని రామచంద్రయ్యకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీల పరిస్థితిపై ఆరా తీసి వెంటనే రామచంద్రయ్య ఫైల్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీమేరకు ఆయన కుటుంబానికి వెంటనే ఇంటి స్థలం కేటాయించి ఇల్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి మిగతా హామీల అమలుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

హామీలిచ్చి మరిచిన బీఆర్ఎస్ ప్రభుత్వం

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నాటి సీఎం కేసీఆర్ ఆదివాసీ డోలి వాయిద్య కళాకారుడు సకిని రామచంద్రయ్యతో పాటు వనజీవి రామయ్యలకు పద్మశ్రీ అవార్డు పొందిన సందర్భంగా వారికి ప్రోత్సాహకాలు ప్రకటించడం సంతోషకరమే అయినా ఆయా ప్రోత్సాహకాలను అందించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేశారన్నారు. రామచంద్రయ్య కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం సింగరేణి ఇల్లెందు గెస్ట్‌హౌస్‌లో మంత్రి తుమ్మల విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు గ్రహీతలకు ప్రోత్సాహక బహుమతులను ప్రకటించి వాటిని అమలు మరిచిపోయిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో ప్రత్యేకంగా చర్చించి ఉమ్మడి జిల్లాలోని ఇద్దరు పద్మశ్రీలకు అందాల్సి ప్రోత్సాహకాలు అందేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, కాంగ్రెస్ మహిళా జిల్లా నాయకులు దేవీ ప్రసన్న, నాయకులు పీరినాకి నవీన్, సామా శ్రీనివాసరెడ్డి, వెంకటప్పయ్య, కూచిపూడి బాబు, పాతూరి వెంకటన్న, కేవీ. రావు, జీ కోటేశ్వరరావు, గాండ్ల సురేష్, యూనియన్ నాయకులు వత్సవాయి కృష్ణం రాజు, గట్టయ్య, వరలక్ష్మీ, సబ్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజ్

డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో ప్రతీ ఒక్కరూ భాగం కావాలి

- గంజాయిని అరికట్టడంలో జిల్లాది కీలక పాత్ర
- కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఎస్పీ రోహిత్‌రాజు
- గూడెంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

కొత్తగూడెం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటంలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఎస్పీ రోహిత్‌రాజు పిలుపునిచ్చారు. డ్రగ్స్ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం సబ్‌డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌నుంచి రైల్వేస్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు పాల్గొన్నారు. వీరితోపాటు జిల్లా అధికారులు, అన్నివర్గాల ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం రైల్వేస్టేషన్ ఆవరణలో ఏర్పాటుచేసిన వేదిక వద్ద మత్తుపదార్థాల రహితసమాజం కోసం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మత్తు పదార్థాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళుతోందన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లా మీదుగా జరుగుతున్న గంజాయి అక్రమ రవాణాను జిల్లా పోలీసులు సమర్థవంతంగా అడ్డుకుంటున్నారని అభినందించారు. మండుటెండలోనూ గంజాయి రహిత సమాజం కోసం ర్యాలీకి కదిలివచ్చిన ప్రతీ ఒక్కరికి ఎస్పీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల రహిత జిల్లాగా చేయడంలో పోలీస్‌శాఖ కృషి ప్రశంసనీయమన్నారు. డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీలో పాల్గొన్న యువతను చూస్తే ఆనందంగా ఉందన్నారు. శక్తివంతమైన జిల్లాగా పేరుగాంచిన భద్రాద్రి జిల్లాలో మత్తుపదార్థాలను నివారించడంలో పోలీస్ శాఖ పాత్ర ఎంతో కీలకమన్నారు. డ్రగ్ రహిత సమాజమే లక్ష్యంగా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య, జిల్లా సంక్షేమ అధికారి విజేత, కొత్తగూడెం మునిసిపల్ కమిషనర్‌స్వామి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సులోచనరాణి, జిల్లా అధికారులు, విద్యార్థులు తదితరులుపాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం అంధకారం

మత్తుపదార్థాల వినియోగంతో జీవితం అంధకారమవుతుందని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి జి.భానుమతి తెలిపారు. యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సుజాతనగర్ ధన్వంతరి ఫార్మాసూటికల్ కళాశాలలో జరిగిన న్యాయ చైతన్య కార్యక్రమంలో న్యాయమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలనిసూచించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి. పురుషోత్తంరావు, డిప్యూటి లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.నిరంజన్‌రావు, కళాశాల చైర్మన్ డాక్టర్ భాస్కర్, ఎస్ఐ జుబేదాబేగం, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధికి చోటివ్వండి!

- ఉమ్మడి జిల్లాలో ముమ్మరంగా హైవేలు, సీతారామ ప్రాజెక్టు పనులు
- కొన్నిచోట్ల ఇంకా పూర్తికాని భూసేకరణ
- త్వరగా సేకరించాలని ప్రభుత్వం ఆదేశం
- ఎన్నికలు ముగియడంతో అభివృద్ధి పనులపై అధికారుల దృష్టి



ఖమ్మం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎన్నికల కోడ్ ముగియడంతో అభివృద్ధిపై దృష్టి సారించిన ప్రభుత్వం జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన భూసేకరణపై దృష్టి సారించింది. ఉమ్మడి జిల్లాలో సీతారామ ప్రాజెక్టుతో పాటు పలు జాతీయ రహదారులు నిర్మాణంలో ఉండంతో ఆయా ప్రాజెక్టులకు అవసరమైన పెండింగ్ భూసేకరణపై అధికార యంత్రాంగం దృష్టిసారించింది. ఆగస్టు 15 నాటికి సీతారామ ద్వారా ఏన్కూర్ లింక్ కెనాల్‌కు నీరు విడుదల చేయాలని, ఏడాదిన్నరలోగా మొత్తం సీతారామ ప్రాజెక్టు పనులు పూర్తి చేసి 10లక్షల ఎకరాలకు సాగునీరందించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో అందుకు అవసరమైన భూసేకరణపై అధికారులు దృష్టి సారించారు. మరోవైపు ఉమ్మడి జిల్లాలో నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారుల పనులను వేగంగా పూర్తి చేయాలని జిల్లా మంత్రులు ఆదేశించడంతో రెవెన్యూ, ఇరిగేషన్, జాతీయ హైవే అథారిటీ అధికారులు భూసేకరణపై దృష్టిసారించారు.

సీతారామ ప్రాజెక్టు పనులు కొన్నిచోట్ల పూర్తయినా, మరికొన్ని ప్యాకేజీల పనులుకు భూసేకరణ పూర్తికాకపోవడంతో జాప్యం జరుగుతోంది. అలాగే ఏన్కూరు లింక్‌కెనాల్ కోసం 147.30ఎకరాలు సేకరించాల్సి ఉంది. ఇందుకోసం రైతులు ఎక్కువ ధర కావాలని డిమాండ్ చేస్తున్నారు. భూసేకరణ పూర్తయితేనే లింక్‌కెనాల్ పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. పరిహారం విషయమై ఇటీవల వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ రైతులతో కలిసి వచ్చి కలెక్టర్‌కు సమస్యను వివరించారు. అలాగే సత్తుపల్లి మండలంలో యాతాలకుంట ట్రంక్ పరిధిలో 980 ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉంది. ఈ భూమి వస్తేనే కాలువ పూర్తయ్యే అవకాశం ఉంది. అలాగే జూలూరుపాడు వద్ద టన్నెల్ నిర్మించాలని ఇటీవల నిర్ణయించారు. ఈ టన్నెల్‌కు కూడా 200 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉంది. ఇక పాలేరు లింక్ కెనాల్‌కోసం టెండర్ల ప్రక్రియ పూర్తికాగా దీనికోసం 1,570 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. ఈ మొత్తం భూసేకరణ జరిగితేనే సీతారామ పనులు సక్రమంగా జరిగే అవకాశం ఉంది. పాలేరు లింక్‌కెనాల్‌తో పాటు అటవీ భూములకు అనుమతి అవసరం ఉంది. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన మూడు చోట్ల లిఫ్టు ఇరిగేషన్ పనులు పూర్తికాగా కాలువల పనులు కూడా పూర్తయ్యాయి. వచ్చే ఆగస్టు 15 నాటికి వైరా ప్రాజెక్టుకు ఏన్కూరు లింక్‌కెనాల్ పనులు పూర్తిచేసి సాగునీరు ఇవ్వాలని ఇటీవల దీనిపై సమీక్ష నిర్వహించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి దిశానిర్దేశం చేశారు. అందుకనుగుణంగానే ఏన్కూరు లింక్‌కెనాల్ పనులు రూ.72కోట్లతో జరుగుతున్నాయి. భూసేకరణ పనులు కూడా వేగవంతమైతే నిర్మాణ పనులు కూడా వేగంగా జరిగే అవకాశం ఉంది.

జాతీయ రహదారుల్లోను...

రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నేషనల్ హైవే అథారిటీ ద్వారా రహదారుల పనులు జరుగుతున్నాయి. నాగపూర్-అమరావతి హైవేకు ఖమ్మం పరిధిలో 152 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉంది. దీని కోసం ప్రాథమిక సర్వే పూర్తి చేశారు. రైతులకు చెల్లించాల్సిన పరిహారంపై నిర్ణయం ఇంకా పెండింగ్‌లో ఉంది. ఖమ్మం-విజయవాడ పరిధిలో మొత్తం 674 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉండగా ఇందులో కొంత పూర్తిచేశారు. ఖమ్మం-కొరివికి 156ఎకరాల భూసేకరణ పూర్తయ్యింది. ఇంకా కొన్నిచోట్ల భూములు తీసుకోవాల్సి ఉంది. దేవరపల్లి-ఖమ్మంజాతీయ రహదారికి సంబంధించి 10మండలాల్లో 1,350 ఎకరాలు భూసేకరణ పూర్తి చేశారు. ఇంకా కొన్నిచోట్ల ఎగ్జిట్‌గేట్‌కు భూసేకరణ చేయాల్సి ఉంటుంది. అమరావతి రహదారిలోనూ కొత్తగా ఎగ్జిట్ గేట్లను ప్రతిపాదించారు. వీటికి కూడా కొంత భూసేకరణ చేయల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తయితేనే అభివృద్ధి పనులు మరింత వేగంగా జరిగే అవకాశం ఉంది.

28న పాలేరులో, 29న కొత్తగూడెంలో

మెగా జాబ్‌మేళా

- 60 కంపెనీలతో నిర్వహణకు కసరత్తు
- 5 వేల మందికి ఉద్యోగాలే లక్ష్యం
- మంత్రి పొంగులేటి చొరవతో ఏర్పాటు

కూసుమంచి/కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్ 26: నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు యువజన, క్రీడాశాఖల ఆధ్వర్యంలో జాబ్ మేళాలు ఏర్పాటు చేస్తున్నారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో 28న కూసుమంచి మండలం పాలేరులోని బీవీ రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నారు. జిల్లా యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో ఈ జాబ్‌మేళాను నిర్వహించనున్నారు. 60కి పైగా కంపెనీలు పాల్గొనే ఈ జాబ్ మేళా ద్వారా 5వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సంకల్పించారు. ఏడో తరగతి నుంచి పీజీ విద్యార్హత కలిగి 35 ఏళ్ల లోపు వయస్సున్న వారు ఈ ఎంపికలకు అర్హులని సంస్థ పేర్కొంది. జాబ్‌మేళాలో డ్రైవర్ మొదలు ప్రతిష్టాత్మక కంపెనీల్లో ఐటీ, మార్కెటింగ్ విభాగాల్లో ఉద్యోగాలు కల్పించనున్నారు.

29న కొత్తగూడెంలో..

భద్రాద్రి జిల్లా కేంద్రం కొత్తగూడెం క్లబ్‌లో 29న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా డీవైఎస్‌వో కె.సంజీవరావు తెలిపారు. బుధవారం ఐడీవోసీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. తెలంగాణ సొసైటీ ఆఫ్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయ్‌మెంట్ ప్రమోషన్స్, సికింద్రాబాద్-భద్రాద్రి జిల్లా కలెక్టర్ ఆదేశాలనుసారం జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆన్‌లైన్‌లో ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు నేరుగా జాబ్‌మేళాకు హాజరుకావచ్చని తెలిపారు. అభ్యర్థులు బయోడేటాతోపాటు విద్యార్హత ధ్రువపత్రాలను తీసుకొని రావాలని సూచించారు. 18 నుంచి 35 ఏళ్లలోపు నిరుద్యోగులు విద్యార్హత లేకున్నా ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. పూర్తి వివరాల కోసం 9642333667, 7288921431 నెంబర్లను సంప్రదించాలని కోరారు.



రెండేళ్లకే ఆయిల్‌పాం దిగుబడి

- పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన బొప్పన రామారావు వ్యవసాయ క్షేత్రం
- తోటను పరిశీలించిన ఉమ్మడి జిల్లా ఆయిల్‌ఫెడ్ అధికారులు

6



మంత్రి తుమ్మలకు మొక్కను అందజేస్తున్న భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్, కలెక్టర్ జితేష్ వి. పాటిల్

'భద్రాద్రి' అభివృద్ధికి కృషిచేయండి

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కొత్తగూడెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అన్ని శాఖల సమన్వయంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధికి కృషిచేయాలని, జిల్లాలో శాంతిభద్రతలు ప్రశాంతంగా ఉండేలా విధులు నిర్వహించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావును భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ఇల్లెందు గెస్ట్‌హౌస్‌కు వచ్చిన తుమ్మలను కలెక్టర్, ఎస్పీలు కలుసుకుని మొక్కను అందజేశారు. నూతనంగా జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన జితేష్ వి. పాటిల్ జిల్లాకు వచ్చినమంత్రి తుమ్మలను తొలిసారిగా కలుసుకుని స్వాగతం పలికారు. కలెక్టర్‌తోపాటు జిల్లా ఎస్పీ కూడా మంత్రి తుమ్మలను కలిసి స్వాగతించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల ప్రజలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి విషయమై పలు సూచనలు చేశారు.

ప్రజాపాలనపై 'అయోమయం'

- ఆరు గ్యారంటీల అమలులో దరఖాస్తుదారులకు చేరని పథకాలు
- పౌర సేవాకేంద్రాలకు కాళ్లరిగేలా తిరిగినా కానరానిఫలితం
- ఎడిట్ ఆప్షన్ ఇస్తేనే సరిచేస్తామంటున్న అధికారులు
- తిరిగి దరఖాస్తు చేసుకుంటున్నా ప్రయోజనం శూన్యం

ఆరు గ్యారెంటీలు అందకుండా పోతున్నాయి. ప్రజాపాలన దరఖాస్తులు లబ్ధినందించడం లేదు. కొందరికి పథకాలు అందినా వారిలో ఎన్నికల తర్వాత వారికీ బ్రేక్ పడింది. ఎంపికలో లోపాలు తలెత్తగా మరోసారి దరఖాస్తు చేసుకోవాల్సిన గందరగోళ పరిస్థితి నెలకొంది. ఆన్‌లైన్‌లో ఎంట్రీలో చేసిన పొరపాట్లు.. ప్రజలకు గ్రహపాటుగా మారాయి. ఎడిట్ ఆప్షన్ ఇస్తే మెజార్టీ ప్రజలకు జీరో కరెంటు బిల్లులు, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందే అవకాశాలున్నాయి. ఎక్కడ లోపం జరిగిందోగానీ.. అనేక మంది అర్హులకు ఈ రెండు గ్యారంటీలు అమలు కాక ప్రజలు అయోమయంలో పడ్డారు.

సత్తుపల్లిరూరల్, జూన్ 26: గృహజ్యోతి, గ్యాస్ పథకాలకు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. అయితే ప్రజాపాలన సేవాకేంద్రాలలో మాత్రం ఆ అవకాశం లేదని సిబ్బంది చెప్పడంతో నిరాశతో ప్రజలు వెనుతిరుగుతున్నారు. ప్రజాపాలన రశీదుతో పాటు కరెంట్‌బిల్లు, గ్యాస్‌బుక్‌కు సంబంధించిన జిరాక్స్ కాపీలతో తిరిగి దరఖాస్తు చేసుకుంటున్నా ఆన్‌లైన్‌లో ఎడిట్ ఆప్షన్ లేకపోవడంతో ప్రయోజనం కనిపించడం లేదు. ప్రజాపాలన వెబ్‌సైట్‌లో రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్, మొబైల్ నెంబరు ద్వారా దరఖాస్తును ఓపెన్ చేసిన తర్వాత రేషన్ కార్డ్, విద్యుత్ యూనిక్ సర్వీస్ నెంబర్, గ్యాస్ నంబర్ ఆప్షన్స్ చూపిస్తుండగా అవన్నీ మ్యాచ్ అయినట్లుగా ఉన్నా లబ్ధిదారులకు రెండు పథకాలు అమలు కావడం లేదని, సర్వీస్ నంబర్, గ్యాస్ నంబర్ ఎంటర్ చేసే అవకాశం కొన్నిటికే వస్తుండగా మిగతా దరఖాస్తుదారులకు నిరాశే ఎదురవుతోంది.

నిర్లక్ష్యంగా ఆన్‌లైన్‌లో ఎంట్రీ...

ప్రజాపాలన గ్రామసభలో భాగంగా మునిసిపాలిటీ, ఎంపీడీవో కార్యాలయం, గ్రామ పంచాయతీ ఉద్యోగులు, సిబ్బంది నిర్లక్ష్యంగా తప్పులుగా తమ దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారని పథకాలు పొందని వారు ఆరోపిస్తున్నారు. గ్యాస్ ఏజెన్సీల వద్ద ఆన్‌లైన్‌లో కూడా తమకు చెందని బ్యాంక్ ఖాతాలు లింక్ అయ్యాయని, తమ ఖాతాలకు డబ్బులు జమ కావడం లేదని మరికొందరు సేవా కేంద్రాలకు వస్తున్నారు. అదేవిధంగా విద్యుత్ అధికారులు ఇంటింటికి తిరిగి యూనిక్ ఐడీ నంబర్, సర్వీస్ నంబర్, రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్ నంబర్లు వారికి ఇచ్చిన మొబైల్ యాప్‌లో కొందరివి మాత్రమే నమోదు చేశారని, నమోదు చేసినప్పటికీ కొందరికే జీరో బిల్లు వస్తోందని, 200యూనిట్లు వాడిన తామెందుకు బిల్లులు చెల్లించాలని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.



సత్తుపల్లి సేవా కేంద్రంలో దరఖాస్తుదారులు

ఎడిట్ ఆప్షన్ ఇస్తేనే లబ్ధిదారులకు అవకాశం

సత్తుపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల కోడ్‌కు ముందు 420 దరఖాస్తులు లబ్ధిదారుల నుంచి రాగా 25వ తేదీ మధ్యాహ్నం వరకు 300వరకు వచ్చినట్లు ఎంపీడీవో అధికారులు చెప్పారు. మునిసిపాలిటీలో సుమారు 150వరకు దరఖాస్తులు అప్‌డేట్ చేయగా సుమారు 200మంది వెనుతిరిగి వెళ్లినట్లు తెలుస్తోంది. అయితే ప్రజాపాలనలో తప్పులుగానీ, కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి గానీ, నాట్ మ్యాచ్ వచ్చినా సరిచేసే అవకాశం ఇప్పుడు ఆన్‌లైన్‌లో రావడం లేదని, ఎడిట్ ఆప్షన్ ఇచ్చి కొత్తవారి దరఖాస్తులు స్వీకరించినట్లయితే ఈ రెండు పథకాలు లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అమలయ్యే అవకాశం ఉంటుందని మునిసిపల్ కమిషనర్ మందా రవిబాబు, ఎంపీడీవో నాగేశ్వరరావువేర్వేరుగా వివరణ ఇచ్చారు.

గృహజ్యోతి లబ్ధిదారులు 31,645మంది

సత్తుపల్లి ఈఆర్‌వో పరిధిలోని లంకపల్లి, పెనుబల్లి, రాయుడుపాలెం, సత్తుపల్లి, సత్తుపల్లి రూరల్, వేంసూరు సెక్షన్ల పరిధిలో మొత్తం 60,884మంది గృహ వినియోగదారులు ఉన్నారు. వీరిలో గృహజ్యోతి లబ్ధిదారులు 31,645మంది కాగా 28,900మందికి ఈనెల 1వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జీరో బిల్లులకు సబ్సిడీగా రూ.1,09,32,154తో జారీచేసినట్లు సత్తుపల్లి విద్యుత్ శాఖ డీఈ ఎల్.రాములు తెలిపారు. సత్తుపల్లి పట్టణంలో 21,269మంది వినియోగదారులు ఉండగా వారిలో 5799మందికి మాత్రమే జీరో బిల్లు వస్తుండగా ఇంకా 7087మంది జీరో బిల్లులు లబ్ధిదారులున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇలా ఈ విధంగా పరిశీలిస్తే నియోజకవర్గంలో లెక్కలలో భారీగా వ్యత్యాసం కనిపించే అవకాశాలు ఉన్నాయి.

విద్యుత్ శాఖ డీఈ ఎల్.రాములు

'పేగు ముడత'కు శస్త్రచికిత్స

- రోగికి సాంత్వన చేకూర్చిన ఖమ్మం జనరల్ ఆసుపత్రి వైద్యులు
- ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 26: ఎవరికైనా 10... 15 ఏళ్లలో బహిర్గతమయ్యే పేగుకు సంబంధించిన వ్యాధి అది. కానీ ఓ వ్యక్తి 40 ఏళ్ల వయస్సులో బయటపడింది. దీన్ని గమనించిన జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వైద్యులు అప్రమత్తం అయి తక్షణమే ఆపరేషన్ ద్వారా ఆ వ్యక్తికి ప్రాణాపాయం నుంచి కాపాడారు. ఎక్కడో కార్పొరేట్ ఆస్పత్రిలో అత్యంత ఖరీదైన శస్త్రచికిత్సను పైసా ఖర్చు కాకుండా నిర్వహించి ఆ రోగికి తిరిగి జీవం పోశారు.

జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వైద్యులు అరుదైనా పరేషన్ చేసి ఓ రోగిని కాపాడారు. సత్తుపల్లి మండలం రాజుపేట గ్రామానికి చెందిన బి. వెంకటేశ్వర్లు అనే 40 ఏళ్ల వ్యక్తి గత మంగళవారం తీవ్ర కడుపునొప్పితో సత్తుపల్లి ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడ పరీక్షించిన వైద్యులు ఖమ్మం ఆస్పత్రికి రిఫర్‌చేశారు. అదే రోజు రాత్రి 10 గంటలకు జిల్లా ఆస్పత్రిలో చేరారు. ఆ వ్యక్తి పరిస్థితిని గమనించిన వైద్యులు అన్ని పరీక్షలు నిర్వహించారు. ఎక్స్‌రే, సీటీ స్కానింగ్ ద్వారా ఆ వ్యక్తికి కలుగుతున్న బాధ ఎంటని పరీక్షించారు. వాటికి కూడా చిక్కని వ్యాధి ఆ వ్యక్తిని బాధిస్తుందని అంచనాకు వచ్చిన వైద్య బృందం పేగు ముడుత పడినట్లు (మెస్కోలిక్ హెర్నియా) గమనించారు. మొత్తంగా హెర్నియా లా వచ్చిన ఆ పేగు ముడుత పడి నల్లగా మారిపోయింది. మారో నాలుగు గంటల పాటు జాప్యం అయితే పేగు నల్లగా మారిపోయి కుళ్లి ప్రాణానికే ప్రమాదంగా సంభవించేది. అలాంటి పరిస్థితుల్లో తక్షణమే ఆపరేషన్ నిర్వహించారు. రాత్రి 10.30 నుంచి 2 గంటల పాటు ఆపరేషన్ నిర్వహించారు. ముడుత పడిన పేగును 10 సెంటీమీటర్ల మేర కత్తిరించి తిరిగి యథాస్థానానికి తీసుకొచ్చారు. ప్రస్తుతం శస్త్ర చికిత్స చేసుకున్న రోగి పూర్తిగా కోలుకున్నారు. కడుపునొప్పి తగ్గిపోయింది. ఆపరేషన్ చేసుకున్న తర్వాత ఎలాంటి పరిణామాలు లేకుండా పూర్తిగా కోలుకోవడంతో అతనిని బుధవారం ఇంటికి పంపించారు.

ఈ విషయాన్ని తెలుసుకున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, ఆస్పత్రి సూపరిన్‌టెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ వైద్యుల బృందాన్ని అభినందించారు.



పేగుకు ఆపరేషన్‌తో కోలుకున్న వ్యక్తిని పరామర్శిస్తున్న వైద్య బృందం

భూముల రిజిస్ట్రేషన్ ధరల పెంపును

తక్షణమే విరమించుకోవాలి

- సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 26: ఆరు గ్యారెంటీ పథకాలను 100రోజుల్లోపు అమలు చేస్తామని ప్రజల్ని నమ్మించి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 200రోజుల పరిపాలనలో ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయటంలో విఫలం చెందిందని సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తీవ్రంగా ఆరోపించారు. ఆదాయం పెంచుకునేందుకు భూముల రిజిస్ట్రేషన్ ధరలను పెంచుతుందని, తక్షణమే ధరల పెంపు నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం మినహా రాష్ట్ర ప్రభుత్వం ఒరగ పెట్టిందేమి లేదని కొట్టిపారేశారు. బుధవారం సీపీఎం జిల్లా కార్యాలయం సుందరయ్య భవన్‌లో రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో నున్నా నాగేశ్వరరావు మాట్లాడారు. ఆసరా పింఛన్ల పెంపు జరగలేదని, ఉచిత విద్యుత్ సక్రమంగా అమలు జరగటం లేదని విమర్శించారు. నిరుపేదలకు కనీసం రేషన్‌కార్డులను కూడా ఇవ్వలేక పోయిందన్నారు. రైతుబంధు రూ.15వేలు అమలు జరపలేదని, 18ఏళ్ల పైబడిన మహిళలకు రూ.2,500 ఇవ్వటం లేదని ధ్వజమెత్తారు. రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ అమలుచేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించి ఇప్పుడు కొర్రిలు పెట్టేందుకు చూస్తోందని, భూమి ఉన్న ప్రతి రైతుకి రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులను గుర్తించి వారికి ప్రోత్సాహకాలను ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన హామిలను నెరవేర్చకుంటే సెప్టెంబరు నుంచి ఉద్యమాలు చేస్తామని డెడ్‌లైన్ పెట్టి నున్నా నాగేశ్వరరావు హెచ్చరించారు.



మాట్లాడుతున్న నాగేశ్వరరావు



ఏరియా ఇంజనీర్ నర్సిరెడ్డిని సత్కరిస్తున్న జీఎం రామచందర్

ఇంజనీర్ నర్సిరెడ్డి ఉన్నతుడు

- ఏరియా జీఎం దుర్గం రామచందర్

మణుగూరుటౌన్, జూన్ 26: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఏరియా ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తోన్న ఎం. నర్సిరెడ్డి ఉన్నతమైన భావాలు కలిగిన అధికారి అని ఏరియా జీఎం దుర్గం రామచందర్ కొనియాడారు. బుధవారం జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నర్సిరెడ్డి జూన్ నెలాఖరున రిటైర్డ్ కాబోతున్న సందర్భంగా అయణ్ను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడారు. ఎగ్జిక్యూటీవ్‌గా గోదావరిఖని ఏరియాలో ఉద్యోగంలో చేరిన నర్సిరెడ్డి తన ఉన్నతమైన భావాలు, బాధ్యతగా ఉద్యోగ విధులు నిర్వరిస్తూ ఉన్నతమైన స్థాయికి వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం శ్యాంసుందర్, అధికారులు డీ వెంకటేశ్వర్లు, ఏఎస్‌ఓ వెంకటరమణ, ఎస్ రమేష్, వెంకటరావు, శ్రీనివాసమూర్తి, అనురాధ, షబ్బీరుద్దీన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. మణుగూరు ఏరియా పర్యటనకు వచ్చిన జీఎం స్టోర్ ఎలిషా ఏరియాలోని స్టోర్స్‌ను పరిశీలించారు. స్టోర్స్ అధికారులకు, సిబ్బందికి పలుసూచనలు చేశారు. అనతరం జీఎం స్టోర్స్ ఎలిషాను ఏరియా అధికారులు సత్కరించారు.

కస్టడీకి అఫ్జల్ హసన్

ఖమ్మంక్రైం, జూన్ 26: నగరంలోని విజయనగర్‌కాలనీలో ఓ నివాసస్థలంలో నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, విలువైన పత్రాలతో ఫోర్జరీ చేసి రిజిస్ట్రేషన్ చేసిన కేసులో ఇటీవలే టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్ అరెస్టయి రిమాండ్‌లో ఉన్న విషయం తెలిసిందే. ఈసందర్భంగా ఖమ్మం టూ టౌన్ పోలీసులు విచారణకు తమ కస్టడీకి ఇవ్వాలని కోర్టును ఆశ్రయించగా రెండు రోజులపాటు కస్టడీకి కోర్టుకు అనుమతి ఇచ్చింది. దీంతో బుధవారం అఫ్జల్‌హసన్‌ను పోలీసులు కస్టడీకి తీసుకుని విచారణ చేశారు. కాగా గురువారం కూడా పోలీసుల కస్టడీలోనే ఆయన ఉండనున్నారు.

పిచ్చి కుక్క దాడిలో చిన్నారికి తీవ్రగాయాలు

కామేపల్లి/ కల్లూరు, జూన్ 26: పిచ్చి కుక్క దాడిలో ఓచిన్నారికి తీవ్రగాయులు అయిన సంఘటన కామేపల్లి మండల గోవింద్రాలలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గోవింద్రాల జక్కుల సృజన్‌కుమార్ 4వ తరగతి చదువుతున్నాడు. బుధవారం సెలవు దినం కావడంతో ఇంటి వద్ద పిల్లలతో ఆడుకుంటున్నాడు. ఓ పిచ్చి కుక్క సృజన్‌పై ఒక్కసారిగా దాడి చేసి కొంత దూరం లాక్కొని వెళ్లింది. చేతికి తీవ్రగాయాలు కావడంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కల్లూరులో.. కల్లూరు పట్టణంలో ఏడాదిన్నర బాలుడు కుక్కదాడిలో గాయపడ్డాడు. రంపంకోత మిల్లు సమీపంలోగల ఎం.ఇజహాన్ అనే ఏడాదిన్నర బాలుడు ఇంటి ముందు నిల్చొని ఉండగా దారి వెంట వచ్చిన కుక్క దాడిచేసి గాయపర్చింది. బాలుడికి వైద్యం నిమిత్తం కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు

పాల్వంచ, జూన్ 26: వివాహిత అదృశ్యమైన ఘటనపై పాల్వంచ రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లాకు చెందిన భవాని(19)కి పాల్వంచ మండలం ప్రభాత్‌నగర్ రెడ్డిగూడెంకు చెందిన కేసాని నాగరాజుతో రెండు నెలల క్రితం వివాహం జరిగింది. మంగళవారం మెడికల్ రిప్రజెంటేటీవ్‌గా పని చేస్తున్న నాగరాజు తన ఉద్యోగానికి వెళ్లగా భవాని అత్తింటివారు పొలానికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన అత్త విజయకు కోడలు ఇంట్లో కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల వెతికింది. స్థానికంగా వాకబు చేసి బంధువులకు, భవాని పుట్టింటి వారికి సమాచారం అందించింది. విజయ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ హెడ్ కానిస్టేబుల్ హరిబాబు తెలిపారు.

యువతికి వేధింపులు.. పోలీసుల అదుపులో నిందితుడు

ఖమ్మం క్రైం, జూన్ 26: యువతి పేరుమీద ఇన్‌స్టాగ్రామ్ నకిలీఖాతా ఓపెన్‌చేసి వేధించిన నిందితుడిని బుధవారం ఖమ్మం సైబర్‌క్రైమ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సౌబర్ క్రైమ్ డీఎస్పీ ఫణీంధర్ తెలిపిన వివరాల ప్రకారం కల్లూరు మండలానికి చెందిన ఓ యువతి పేరిట అదే గ్రామానికి చెందిన వెంకటకృష్ణ అనే యువకుడు ఇన్‌స్టాగ్రామ్‌లో ఫేక్ అకౌంట్ ఓపెన్‌చేసి పలు పోస్టులు చేశాడు. సదరు యువతి మే 25న సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసులు విచారణజరిపి అదే గ్రామానికి చెందిన వెంకటకృష్ణగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

మహిళపై హత్యాయత్నం.. నాలుగేళ్ల జైలు

ఖమ్మం లీగల్, జూన్ 26: కూసుమంచి మండలం ఈశ్వరమాధారం గ్రామానికి చెందిన మహిళపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో నిందితుడైన నందిరెడ్డి మోహన్‌రెడ్డి(32)కి నాలుగేళ్ల జైలుశిక్షతోపాటు జరిమానా విధిస్తూ ఖమ్మం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి కె.చంద్రశేఖర్‌రావు బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ది.29-07-2017న ఫిర్యాది ఈశ్వరమాధారం గ్రామానికి చెందిన మాచిరెడ్డి వెంకటరెడ్డి కథనం ప్రకారం ఉదయం 10 గంటలకు ఫిర్యాది తల్లి మాచిరెడ్డి రామకోటమ్మ పొలం దగ్గరకు వెళ్లేసరికి నిందితులు నందిరెడ్డి మోహన్‌రెడ్డి, భార్య చెల్లెలు అయిన సుజాత, వారి పొలంలో ఉన్న కంపచెట్లను నరికి ఫిర్యాది పొలంలో వేశారు. ఇదేంటని రామకోటమ్మ ప్రశ్నించగా నిందితుని దగ్గర ఉన్న గొడ్డలితో ఫిర్యాది తల్లిని నరకడానికి వెళ్లగా చేతులను అడ్డుపెట్టుకోవడంతో ఆమె చేతివేళ్లకు తీవ్రగాయాలు అయ్యాయి.

దీంతో ఆమెను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని కూసుమంచి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు నిందితుడిపై 307, 294(బి) ఐపీసీ సెక్షన్‌ల కింద కేసు నమోదుచేసి అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచి చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి నిందితుడిపై నేరం రుజువుకావటంతో పై విధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెల్లం ప్రతాప్‌బాబు వాదించగా, లైజన్ అధికారి ఎం.మోహన్‌రావు, కోర్టు కానిస్టేబుల్ గోపి, హోంగార్డ్ ఓరుగంటి శ్రీనివాసరావులు సహకరించారు.

అసౌకర్యం కలుగకుండా బ్లాస్టింగ్ చేయండి

- సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర రెడ్డి

సత్తుపల్లిరూరల్, జూన్26: బ్లాస్టింగ్ సమయంలో దుమ్మూ లేవకుండా సమీపంలోని కిష్టారం, రేజర్ల, ఇత్ర ప్రాంతాలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా బ్లాస్టింగ్ చర్యలు తీసుకోవాలని సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్టు, ప్లానింగ్) జీ.వెంకటేశ్వరరెడ్డి ఆదేశించారు. ఆయన ఆకస్మికంగా సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీ గనులను సందర్శించారు. ఓసీ గనులలో బ్లాస్టింగ్ చేయడంలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలు, వర్షాకాలంలో తీసుకోవాల్సిన రక్షణ పనులపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ షాలెం రాజు, పీవోలు ఎంవీ.నరసింహారావు, అధికారులు రమణారావు, ఎం.నరసింహారావు, లక్ష్మణ మూర్తి, రామకృష్ణ, శ్రీనివాస్, వెంకట్ పాల్గొన్నారు.



గనుల వద్ద సూచనలిస్తున్న డైరెక్టర్

వన్యప్రాణుల వేట.. వ్యక్తికి రిమాండ్

- ప్రాణాపాయంలో ఉన్న జంతువుల వీడియో చిత్రీకరణ

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 26: వన్యప్రాణులకు బయటి ప్రపంచం తెలియదు. ప్రకృతి సిద్ధంగా ఏర్పడి ఆహారపు గోలును విధంగా మూగ జీవాలు జీవిస్తుంటాయి. అయితే ఆ వన్యప్రాణులపై దృష్టి పెట్టి ఉచ్చులు, వలతో వాటిని బంధించి అవి ప్రాణాపాయంలో కొట్టుకొనే దృశ్యాలను వీడియోలో చిత్రీకరించి తర్వాత వాటిని అత్యంత క్రూరంగా చంపి వాటి మాంసాన్ని అమ్మకాలు చేస్తున్న నిందితుడిని అటవీ శాఖ అధికారులు రిమాండ్ చేశారు. ఖమ్మం ఎఫ్‌డీవో మంజుల తెలిపిన వివరాల మేరకు.. ఖమ్మం రూరల్ మండలం పొలేపల్లికి చెందిన తమ్మిశెట్టి వంశీ అతని స్నేహితులు ఒక ముఠాగా ఏర్పడ్డారు. అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులను లక్ష్యంగా చేసుకున్నారు. జంగి పిల్లులు, ఉడుములు, అడవి పిల్లులు, కుందేళ్లు ఇతర జంతువులను వేటాడేందుకు వలలు, ఉచ్చులు, తీగలతో షికారు కుక్కలను వెంట పెట్టుకొని అటవీ ప్రాంతంలో వేటాడుతున్నారు. ఇలా వేటకు చిక్కిన జంతువులను వీడియోలో చిత్రీకరించే వారు. వాటిని సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెడుతున్నారు. వేటకు చిక్కిన జంతువుల మాంసాన్ని అమ్మకాలు జరుపుతున్నారు. ఈ క్రమంలో వన్యప్రాణాల సంరక్షణ చేపడుతున్న ఓ వ్యక్తి అటవీశాఖ అధికారులకు పూర్తి వివరాలతో ఫిర్యాదు చేశారు. దీంతో ఖమ్మం ఎఫ్‌డీవో మంజుల ఆధ్వర్యంలో నిందితుడు తమ్మిశెట్టి వంశీ, అతని వద్ద ఉన్న వేట వస్తువులను రిమాండ్ చేసినట్లు తెలిపారు.

వర్జీనియా పొగాకుకు రికార్డు స్థాయి ధర

అశ్వారావుపేట, జూన్, 26: వర్జీనియా పొగాకుకు రికార్డుస్థాయిలో ధర పలికింది. ఏపీలోని జంగారెడ్డిగూడెం పొగాకు వేలం కేంద్రంలో పొగాకు కిలో రూ.352లకు బయ్యర్లు కొనుగోలు చేశారు. ఏప్రిల్ 27న జరిగిన విక్రయాలలో కిలో ధర రూ.341 పలకగా.. గురువారం జరిగిన వేలంలో రూ.352లు రికార్డుగా నమోదైంది. కేంద్రానికి 1025 బేళ్లు రాగా వాటిలో 731 బేళ్ల విక్రయాలు జరిగాయి.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

అన్నపురెడ్డిపల్లి, జూన్, 26: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన కోయగట్టుగూడెం గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం... కోయకట్టుగూడెం గ్రామానికి చెందిన ఎరదేశి భద్రరరావు(21) కూలీపలు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గుంపెన పంచాయతీతలో తాగునీటి మోటారు చెడిపోవటంతో ప్రైవేటు ఎలక్ట్రీషన్‌కు సాయంగా తన బంధువు మారేష్‌తో కలిసి వెళ్లాడు. మోటరు బాగుచేస్తున్న క్రమంలో విద్యుత్ ఉన్న వైర్లు అందించే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. గ్రామస్థులు వెంటనే ఎర్రగుంట ప్రభుత్వవైద్యశాలకు తరలించగా అప్పటికే భద్రరరావు మృతి చెందాడు. ఒక్కగానికొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరుమని విలపించారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు వైద్యశాల వద్దగల జాతీయ రహదారిపై ఆందోళన చేశారు. ఈవిషయం తెలుసుకున్న డీఎస్పీ అబ్దుల్‌రెహమాన్, సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై రవి కుమార్ అక్కడకు చేరుకొని న్యాయం చేస్తామని బాధిత కుటుంబానికి హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ఎన్నాళ్లీ కన్నీటి వ్యథ?

(5వ పేజీ తరువాయి)

భద్రాద్రి రామాలయ పడమరమెట్ల వైపు సుమారు 50 దుకాణాలుండగా ప్రతి ఏటా వర్షాకాలంలో వర్షం వచ్చినా, వరదొచ్చినా దుకాణాలు నీట మునుగుతున్నాయి. ఇటీవల సైతం ఒక్కసారిగా వచ్చిన భారీ వర్షంతో ఆలయ పరిసరాల్లోని దుకాణాలు నీట మునిగాయి. దీంతో చిరు వ్యాపారులు భారీ నష్టం వాటిల్లకుండా తమ దుకాణాల్లోని సామగ్రిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ సమస్యకు ప్రభుత్వం, అధికారులు శాశ్వత పరిష్కారం చూడాలని వారు వేడుకుంటున్నారు. వరదల సమయంలో భద్రాద్రి రామయ్య దర్శనానికి వచ్చే భక్తులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విస్తా కాంప్లెక్స్ స్లూయిస్ పరిసర ప్రాంతాల్లో రెయిన్ వాటర్, డ్రెయిన్ వాటర్, బ్యాక్ వాటర్ కారణంగా భక్తులకు స్థానికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షాకాలంలో గోదావరికి ఏ కొంచం వరద వచ్చినా భద్రాద్రి రామాలయ పడమర మెట్ల వద్ద భారీగా వరద నీరు చేరుతుండడంతో భక్తులు ఆలయంలోకి వెళ్లలేక పోతున్నారు. అశోకనగర్ కొత్తకాలనీలో సైతం స్లూయిస్‌ల తరుచూ లీకవుతున్నాయి. ఇదిలా ఉండగా వరదల సమయంలో తరచూ దేవస్థానం నిత్యన్నదాన సత్రం నీట మునుగుతోంది. ఈ నేపథ్యంలో నిత్యాన్నదాన సత్రాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలని భక్తులు కోరుతున్నారు. ఇక స్లూయిజ్‌ల వద్ద నీటిని ఎత్తిపోసేందుకు వరద వచ్చినప్పుడే కాకుండా ముందుగానే మోటార్లను ఏర్పాటు చేస్తే కొంతవరకైనా ముంపు ప్రభావాన్ని తగ్గించవచ్చని పలువురు సూచిస్తున్నారు. కనీసం 1,500 హెచ్‌పీ సీమర్థం ఉన్న మోటార్లను ముందుగానే సిద్ధ చేస్తే మంచిదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కరకట్ట పనులు పూర్తయ్యేనా ?

భద్రాచలం-కూనవరం రహదారిలో చేపట్టిన 700 మీటర్ల మిగులు కరకట్ట పనులు నిర్ణీత సమయానికి పూర్తవుతాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్నెళ్ల క్రితం ఈ పనులు ప్రారంభించగా వరదల సీజన్ సమయానికి పనులు పూర్తయ్యే అవకాశాలు తక్కువగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో వరద సమస్యను ఎదుర్కొనేందుకు అధికారులు తగిన ప్రణాళిక సిద్ధం చేయాలి.

'గూడెం'లో నేడు డిప్యూటీ సీఎం పర్యటన

- ముగ్గురు మంత్రులతో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- గోదావరి వరదలపై కలెక్టరేట్‌లో ముందస్తు సమీక్ష

కొత్తగూడెం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటించనున్నారు. మంత్రులు కోమటిరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులతో కలిసి కొత్తగూడెంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపన చేయనున్నారు. వర్షాకాలం నేపథ్యంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని గోదావరి వరదలపై కలెక్టరేట్ సంబంధిత శాఖల అధికారులతో ముందస్తు సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం మంత్రులతో కలిసి మణుగూరు వెళ్లి ఇటీవల మాతృవియోగం పొందిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లను పరామర్శిస్తారు. అనంతరం ఇటీవల మృతి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహిత సకిన రాంచంద్రయ్య కుటుంబసభ్యులను పరామర్శిస్తారు.

పర్యటనలో భాగంగా డిప్యూటీ సీఎం భట్టి హైదరాబాద్‌నుంచి సహచర మంత్రులతో కలిసి హెలీకాప్టర్‌లో గురువారం ఉదయం 10:40కి కొత్తగూడెం చేరుకుంటారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. ఈ సందర్భంగా పోస్టాపీస్ సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 12.45గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుని గోదావరి వరదలపై అధికారులతో ముందస్తు సమీక్ష నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1.45 గంటలకు మణుగూరు వెళతారు. డిప్యూటీ సీఎం సహా మంత్రుల పర్యటన నేపథ్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రెండేళ్లకే ఆయిల్‌పాం దిగుబడి

- పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన బొప్పన రామారావు వ్యవసాయ క్షేత్రం
- తోటను పరిశీలించిన ఉమ్మడి జిల్లా ఆయిల్‌ఫెడ్ అధికారులు

పెనుబల్లి, జూన్ 26: పంట సాగుచేయాలనే పట్టుదల, మొక్కల పెంపకానికి అధికారుల ప్రోత్సాహం, ఎప్పటికప్పుడు రైతు కృషి ఫలితంగా ముందస్తుగానే పామాయిల్ సాగులో పంట దిగుబడి సాధించి ఓ రైతు ఆదర్శంగా నిలిచి అధికారుల ప్రశంసలు అందుకున్నాడు. పెనుబల్లి మండలం కుప్పెనకుంట్ల గ్రామపరిధిలో కల్లూరు పట్టణానికి చెందిన బొప్పన రామారావు అనే రైతు తనకున్న 22ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో పామాయిల్ సాగు చేపట్టాడు. ఆయన తోటలో రెండేళ్లకే ఆయిల్‌పామ్ చెట్లు కాపుకొచ్చి దిగుబడి రావడంతో ఖమ్మం, భద్రాద్రి జిల్లా ఆయిల్‌ఫెడ్ మేనేజర్లు బాలకృష్ణ, జేవీ ఎస్‌డీ.భారతి బుధవారం ఆ తోటను పరిశీలించారు. దిగుబడికి వచ్చిన గెలలను నరికేందుకు అనుమతించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మంజిల్లాలో పామాయిల్ సాగు విస్తీర్ణం పెంచడమే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్నిరకాల రాయితీలు కల్పించి ప్రోత్సహిస్తోందన్నారు. ఇప్పటికే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో లక్ష ఎకరాలకుపైగా పామాయిల్ సాగవుతోందన్నారు. దానిని రెట్టింపు చేయాలనే లక్ష్యంతో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక దృష్టిసారించారని వివరించారు. వేంసూరు మండలంలో త్వరలో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం జరగనుందని అధికారులు తెలిపారు. పామాయిల్ తోటలో మూడేళ్ల వరకు అంతర పంటల సాగుకు అవకాశం ఉన్నా అందుకు భిన్నంగా బొప్పన రామారావు ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో, ఏరీస్ ఆగ్రో సంస్థ ప్రతినిధుల సూచనలతో తన వ్యవసాయ క్షేత్రంలో రెండేళ్లకే ఆయిల్‌పామ్ దిగుబడి సాధించారని అభినందించారు. కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ నాగలక్ష్మీ, ప్లాంట్ మేనేజర్ సాయి తేజ, ఏరీస్ ఆగ్రోస్ సంస్థ ప్రతినిధులు వెంకన్న, భాస్కర్, మనోజ్‌కుమార్, నర్సింహారావు, రైతులు నర్సింహారెడ్డి, వసంతరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గురుకుల అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలి

» సర్కార్‌కు వారి బాధలు కనిపించట్లేదా?: హరీశ్‌రావు

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలే పరమావధిగా నడుస్తున్న ప్రజా ప్రభుత్వానికి గురుకుల టీచర్ పోస్టుల అభ్యర్థుల బాధలు కనిపించకపోవడం బాధాకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంత్రులు, అధికారులను కలిసి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. సీఎం ఇంటి ముందు మోకాళ్ల మీద నిలబడి అభ్యర్థించినా గురుకుల అభ్యర్థుల మొర ఆలకించకపోవడం శోచనీయమన్నారు. బుధవారం ఆయన 'ఎక్స్' వేదికగా గురుకుల అభ్యర్థుల నిరసనకు మద్దతు ప్రకటించారు. వారి సమస్యలను తక్షణం పరిష్కరించాలని బీఆర్ఎస్ తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోస్టులు బ్యాక్‌లాగ్ కాకుండా రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అన్నింటినీ భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా, కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీలో నెలకొన్న ఇబ్బందులను పరిష్కరించేందుకు జీవో46ను సవరించాలని బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. జీవో46కు సంబధించిన కేసు విచారణను అడ్వకేట్ జనరల్ ఉద్దేశపూర్వకంగా వాయిదా వేయించారని ఆరోపించారు.

కేసీఆర్ భూముల కోసమే అలైన్‌మెంట్ మార్చారు

» 'ఆర్ఆర్ఆర్' భూనిర్వాసితుల ఐక్య వేదిక

గజ్వేల్, జూన్ 26: తన భూముల విలువ పెంచుకునేందుకే మాజీ సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు రీజినల్ రింగ్‌రోడ్డు (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్‌ను మార్చారని భూనిర్వాసితుల ఐక్య వేదిక నేతలు మండిపడ్డారు. ఈ అలైన్‌మెంట్‌ను మార్చాల్సిందేనంటూ వారు డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్‌లో ఆర్ఆర్ఆర్ భూనిర్వాసితులు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. అనంతరం గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే తమ భూముల నుంచి కొండపోచమ్మ సాగర్ కాలువలు వెళ్లాయని వెళ్లాయని, ఇప్పుడు రీజినల్ రింగ్ రోడ్డు వెళ్తే.. ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములకు ఆర్డీవో ఎకరాకు రూ.7.50లక్షలు మాత్రమే ఇస్తామంటున్నారని, ఆ డబ్బుతో ఏం వస్తుందని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల ముందు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసినప్పుడు తమకు న్యాయం చేస్తామన్నారని, ఇప్పుడు టెండర్లను పిలుస్తున్నట్లు ప్రకటించడం సరికాదని ఆక్షేపించారు. ఇప్పటికే ఉన్న చిట్యాల-సంగారెడ్డి 161 జాతీయ రహదారినే రీజినల్ రింగ్ రోడ్డుగా మార్చాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీకి షరతులు..వెన్నుపోటే: కిసాన్‌మోర్చా

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రారంభ, ముగింపు తేదీలు అంటూ షరతులు విధించడం.. రైతులకు వెన్నుపోటు పొడవడమేనని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.2లక్షల రుణమాఫీపై తుక్కుగూడ సభలో రాహుల్ గాంధీతో హామీ ఇప్పించారని, దాన్ని అమలు చేయకపోతే ప్రజలే ఆ పార్టీ నేతల తుక్కు రేగ్గొడతారని హెచ్చరించారు. ఖరీఫ్‌లో పెట్టుబడికి డబ్బులు లేక రైతులు అల్లాడుతుంటే... అభిప్రాయ సేకరణ అంటూ ఆటలాడుతున్నారని మండిపడ్డారు. షరతులు లేకుండా రుణమాఫీ అమలు చేయాలని, లేదంటే బీజేపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

పెన్షనర్ల సమస్యలపై ఉద్యమిస్తాం: జేఏసీ

సమస్యల పరిష్కారం కోసం జూలై నుంచి ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ వెల్లడించింది. ఈ మేరకు బుధవారం సీఎస్‌కు నోటీసు అందజేసినట్లు జేఏసీ చైర్మన్ కె.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి శుభాకర్‌రావు తెలిపారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి అనేక సందర్భాల్లో వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఈ మేరకు జూలై 15న అన్ని జిల్లా కేంద్రాల్లో సమావేశాలు పెట్టి కలెక్టర్లకు వినతిపత్రాలు ఇస్తామని వెల్లడించారు. వేలాది మంది పెన్షనర్లతో జూలై 30న ఇందిరాపార్కు వద్ద మౌనదీక్ష చేస్తామని తెలిపారు.

అవినీతికి పాల్పడలేదని పొన్నం చెప్పగలరా?

» మంత్రుల అవినీతిని బ్లాక్ బుక్‌లో నమోదు చేస్తున్నాం

» బీఆర్ఎస్ మళ్లీ వచ్చాక ఎవర్నీ వదిలిపెట్టం: కౌశిక్‌రెడ్డి

బంజారాహిల్స్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ దేవుడిపై ప్రమాణం చేస్తారా? అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నిలదీశారు. ఆయన ప్రమాణం చేస్తే క్షమాపణ చెప్పేందుకు తాను సిద్ధమని ప్రకటించారు. ఫ్లై యాష్ తరలింపులో మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.100 కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారని ఆరోపించిన కౌశిక్‌రెడ్డి.. జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయానికి వస్తే నిరూపిస్తానని సవాల్ విసిరారు. ఈ మేరకు బుధవారం టీటీడీ ఆలయానికి వచ్చిన కౌశిక్‌రెడ్డి.. అక్కడ మీడియాతో మాట్లాడారు. తన ఆరోపణలపై మంత్రి పొన్నం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. లీగల్ నోటీసులు పంపిస్తే భయపడేది లేదని స్పష్టం చేశారు. ఫ్లై యాష్ లారీలను తానే స్వయంగా హుజురాబాద్‌లో పట్టుకున్నానని, వే బ్రిడ్జికి తరలించి తూకం వేస్తే 76 టన్నులు పైగా తీసుకెళ్తున్నట్లు తేలిందన్నారు. నిబంధనల ప్రకారం 16 టైర్ల లారీలో 36 టన్నులు మాత్రమే తీసుకువెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఈ వ్యవహారంలో రవాణా శాఖ మంత్రికి సంబంధం లేదా?అని ప్రశ్నించారు. మంత్రుల అవినీతిని బ్లాక్ బుక్‌లో నమోదు చేస్తున్నట్టు, మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఎవరినీ వదిలేది లేదని హెచ్చరించారు.



ప్రధాని మోదీని కలిసిన బండారు దత్తాత్రేయ, కుటుంబ సభ్యులు

మోదీకి గవర్నర్ దత్తాత్రేయ అభినందనలు

న్యూఢిల్లీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోదీకి హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అభినందనలు తెలిపారు. బుధవారం ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ప్రధాని మోదీని దత్తాత్రేయ కుటుంబ సభ్యులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కృష్ణభగవానుని 'విరాట్ స్వరూప్' విగ్రహాన్ని ప్రధానికి బహూకరించారు. గవర్నర్ సతీమణి బండారు వసంత, కుమార్తె బండారు విజయలక్ష్మి, అల్లుడు, డాక్టర్ బి.జిగ్నేష్ రెడ్డి, బండారు శివశంకర్, మనవరాళ్లు యశోధర రెడ్డి, వేదాంషి రెడ్డిలు మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. యశోధర, వేదాంషి ప్రధాని కోసం రెండు పాటలు పాడగా.. మోదీ వారిని ప్రత్యేకంగా అభినందించి, ఆశీర్వదించారు. మరోవైపు.. ప్రధానిమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి కలిశారు.

మేడిగడ్డ డిజైన్ ఒకటైతే..నిర్మాణం మరోరకంగా

» తుమ్మిడి హెట్టిని పునఃపరిశీలించాలి: కోదండరాం

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ ప్రాజెక్టు డిజైన్ ఒకటైతే నిర్మాణం మరోరకంగా చేశారని, అందుకే అది కుంగిందని టీజేఎస్ అధినేత కోదండరాం అన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యత లేదని, నిర్వహణ కూడా సరిగా లేదని ఆరోపించారు. ఈ విషయాలను డ్యామ్ సేఫ్టీ అధికారులే వెల్లడించారని చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ సుజల స్రవంతి పేరుతో కాంగ్రెస్ హయాంలో తుమ్మిడిహెట్టి వద్ద చేపట్టిన ప్రాజెక్టుకు సంబంధించి రూ.800కోట్ల ఖర్చుతో కాల్వల నిర్మాణం చేపట్టారని గుర్తుచేశారు. తుమ్మిడి హెట్టిని పునఃపరిశీలన చేసి కొంతమేరకు పనులు చేసినట్లయితే.. అప్పుడు చేపట్టిన కాల్వల ద్వారా నీటిని తీసుకొచ్చే అవకాశం ఉందన్నారు. మేడిగడ్డ తప్పిదానికి బాధ్యులపై చర్యలు తీసుకుని శిక్షలు వేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్తు కొనుగోళ్లకు సంబంధించి విచారణ కమిషన్ వేయాలని అడిగిందే బీఆర్ఎస్ వాళ్లన్నారు. ఇప్పుడు కమిషన్‌కు అర్హత లేదని చెప్పి.. వాస్తవాలు తెలియకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రైల్‌రోకో కేసులో కేసీఆర్‌తో పాటు తానూ ఉన్నానని గుర్తు చేసిన కోదండరాం.. ఉద్యమకారులందరిపై కేసులు తొలగించాలని కోరాల్సింది పోయి.. ఆయనపైన ఉన్న కేసులే తొలగించాలనడం విడ్డూరమన్నారు.

స్పీకర్.. అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు

» మెయిల్, స్పీడ్ పోస్టులో ఫిర్యాదులు పంపాం

» పోచారం, సంజయ్‌ను అనర్హులుగా ప్రకటించాలి

» ఇళ్లకు వెళ్లి కండువాలు కప్పడం సిగ్గుచేటు: జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ తరఫున గెలిచిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరడం చట్ట వ్యతిరేకమని, వారిని అనర్హులుగా ప్రకటించాలని ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేద్దామంటే ఆయన అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆరోపించారు. ఆ ఇద్దరిపై అనర్హత వేటువేయాలని కోరుతూ స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శికి వేర్వేరుగా ఈ మెయిల్, స్పీడ్ పోస్టు ద్వారా ఫిర్యాదులు పంపామన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వారిద్దరిపై స్పీకర్ చర్యలు తీసుకోకుంటే న్యాయపరంగా ముందుకెళ్తామన్నారు. పాంచ్‌న్యాయ్‌లో ఫిరాయింపులను ఆమోదించబోమని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఎలా చేర్చుకుంటోందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో చట్టప్రకారం రెండు వంతుల మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరారని గుర్తు చేశారు. తమ పార్టీలో చేరిన వారంతా కేసీఆర్ వద్దకు వచ్చి కండువాలు కప్పుకొన్నారని, కానీ.. ఇప్పుడు రేవంత్ ఇంటింటికి తిరిగి కండువాలు కప్పడం సిగ్గుచేటన్నారు.

ఫిరాయింపులపై కేటీఆర్ మొసలి కన్నీరు

» త్వరలోనే బీఆర్ఎస్ నుంచి మరిన్ని చేరికలు: విప్ ఆది శ్రీనివాస్



హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయింపులపైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. మొసలి కన్నీరు కారుస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపించారు. గతంలో టీడీపీ నుంచి గెలిచిన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను బీఆర్ఎస్‌లో చేర్చుకుని మంత్రిని చేసినప్పుడు కేసీఆర్‌ను ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. 2019లో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నప్పుడు ప్రజాస్వామ్యం ఎటు పోయిందో కేటీఆర్ చెప్పాలన్నారు. సీఎల్పీ మీడియా హాల్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కేసీఆర్.. తన ఫామ్ హౌస్‌లో విందులు పార్టీ ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ మునుగుతున్న నావ అని, రేవంత్‌రెడ్డి అనే తుఫానులో ఆ పార్టీ కొట్టుకుపోవడం ఖాయమని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలను హీనాతి హీనంగా చూసిన చరిత్ర కేసీఆర్‌ది అని ధ్వజమెత్తారు. త్వరలోనే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మరిన్ని చేరికలుంటాయని స్పష్టం చేశారు. ఆ పార్టీలో మిగిలేది నలుగురేనన్నారు. కాగా, దివ్యాంగులకు ఉన్నత విద్యలో 5శాతం రిజర్వేషన్ కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి.. వారి ఆత్మబంధువుగా మారారని టీపీసీసీ దివ్యాంగుల సెల్ చైర్మన్ ముత్తినేని వీరయ్య కొనియాడారు.

మెట్టు దిగిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కాంగ్రెస్సే ముఖ్యమని వెల్లడి.. కేసీ వేణుగోపాల్, దీపాదాస్ మున్షీతో భేటీ

» ఫలించిన అధిష్ఠానం బుజ్జగింపులు

» కాంగ్రెస్‌తోనే జాతి ఐక్యత: జీవన్ రెడ్డి

» పార్టీలో మొదటి నుంచి ఉన్నవారికి ప్రాధాన్యం: దీపాదాస్ మున్షీ

న్యూఢిల్లీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వీడడం ఖాయమన్న వార్తలకు ఫుల్‌స్టాప్ పడింది. తనకు సమాచారం ఇవ్వకుండానే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని తీవ్ర మనస్తాపం చెందిన జీవన్‌రెడ్డి ఎట్టకేలకు మెట్టు దిగారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్నవాళ్ల అభిప్రాయాల ఆధారంగానే చేరికలు, ఇతర విషయాలలో ముందుకెళతామని అధిష్ఠానం హామీ ఇవ్వడంతో ఆయన శాంతించారు. రంగంలోకి దిగిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పరిస్థితిని చక్కబెట్టారు. మూడ్రోజులుగా అసంతృప్తితో రగిలిపోతూ పార్టీని వీడేందుకు సిద్ధపడిన జీవన్‌రెడ్డికి పార్టీ అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చింది. కేసీ వేణుగోపాల్ ఫోన్ చేసి ఢిల్లీ రావాలని కోరడంతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి బుధవారం సాయంత్రం జీవన్ రెడ్డి ఢిల్లీకి చేరుకున్నారు. తెలంగాణ భవన్‌లోని శబరి బ్లాక్‌లో జీవన్‌రెడ్డితో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అరగంటపాటు చర్చలు జరిపారు. అయినా జీవన్‌రెడ్డి వెనక్కి తగ్గలేదు. ఆ తర్వాత ముగ్గురూ కలిసి కేసీ వేణుగోపాల్ ఇంటికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి వెళ్లినా తాను పార్టీని నమ్ముకుని ఉన్నానని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి చెప్పినట్లు తెలిసింది. కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే సంజయ్ చేరికపై అసంతృప్తి వ్యక్తం చేశారని సమాచారం. జీవన్‌రెడ్డిని బుజ్జగించిన పెద్దలు.. పార్టీ అండగా ఉంటుందని, దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పుంజుకుంటున్న సమయంలో పార్టీని వీడవద్దని కోరినట్లు తెలిసింది. దీంతో చల్లబడిన జీవన్‌రెడ్డి సమ్మతించారు. భేటీ అనంతరం బయటికి వచ్చాక జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తనకు కాంగ్రెస్సే ముఖ్యమంటూ వెల్లడించారు. కార్యకర్తలను కాపాడుకోవడం ఏ పార్టీకైనా ముఖ్యమని అన్నారు. కార్యకర్తల ఆత్మగౌరవాన్ని దృష్టిలో పెట్టుకుని, వారి ఆలోచనలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకోవాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మెరుగైన ఫలితాలు వచ్చాయని, లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, జాతి ఐక్యతను కాంగ్రెస్ కాపాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను కాంగ్రెస్ నెరవేరుస్తుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో అమలుకాని పథకాలను తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఏకకాలంలో రూ.31 వేల కోట్లతో రుణమాఫీకి కాంగ్రెస్ సంకల్పించదని ఆయన హర్షం వ్యక్తం చేశారు.



ఢిల్లీలోని తెలంగాణ భవన్ వద్ద ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

ఫిరాయింపులపై బీఆర్ఎస్ మాట్లాడటమా?: దుద్దిళ్ల

పార్టీలో సీనియర్ నేత అయిన జీవన్‌రెడ్డిని కించపరచడం తమ ఉద్దేశ్యం పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ అన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే చేరికను అగౌరవంగా, అమర్యాదగా భావించి ఉండవచ్చన్నారు. పార్టీలో చేరికలకు తలుపులు తెరిచే ఉన్నాయన్నారు. కాంగ్రెస్‌లో మొదటి నుంచి ఉన్నవారికి ప్రాధాన్యం తగ్గకుండా చూస్తామని స్పష్టం చేశారు. ఏ నిర్ణయం తీసుకున్నా కేసీ వేణుగోపాల్‌తో చర్చించే తీసుకుంటామని చెప్పారు. మీడియా అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ.. టీపీసీసీ అధ్యక్ష పదవిపై నిర్ణయం అధిష్ఠానానిదేనని ఆమె పేర్కొన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతల విమర్శలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. ఫిరాయింపులపై ప్రశ్నించేందుకు ఆ పార్టీకి కాస్త అయినా నైతికత ఉండాలని మండిపడ్డారు. అధికారంలో ఉండగా కాంగ్రెస్‌ను అంతం చేయాలని ప్రయత్నించారన్నారు. ఇపుడు బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య మార్పు ఎలా ఉందో స్పష్టంగా కనపడుతోందని ఆయన పేర్కొన్నారు.

డ్రగ్స్‌కు బానిసైతే భవిష్యత్తు అంధకారం

» యువత వ్యసనాలు వీడి ఉన్నత లక్ష్యాలు చేరాలి: జూపల్లి

» మాదక ద్రవ్యాల మత్తులోనే లైంగిక దాడులు, హత్యలు: సీతక్క

మాదాపూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు బానిసైతే ఉజ్వల భవిష్యత్తు అంధకారమవుతుందని, యువత వ్యసనాలను వీడి లక్ష్యం వైపు అడుగులేసి ఉన్నత స్థాయికి చేరుకుని భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహించిన 'డ్రగ్స్ నియంత్రణ.. అక్రమ రవాణాపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మంత్రి సీతక్కతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. మానవ జన్మ ఎంతో ఉత్తమమైనదని.. కానీ చెడు వ్యసనాల కారణంగా అనారోగ్యం పాలైన చాలామంది అర్థాంతరంగా తనువు చాలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచానికి ఉగ్రవాదం తర్వాత అంతటి పెనుసవాలుగా డ్రగ్స్ వినియోగం మారిందన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు కూడా డ్రగ్స్ చేరడం ఆందోళన కలిగించే విషయమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఎంతో డ్రగ్ పెడ్లర్లతో పాటు వినియోగిస్తున్న వారినీ అదుపులోకి తీసుకుని కేసులు పెట్టామని వెల్లడించారు. సీతక్క మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల మాఫియా ప్రపంచాన్ని గడగడలాడించి, కోట్లు కొల్లగొడుతోందన్నారు. మాదకద్రవ్యాల మత్తులో లైంగిక దాడులు, హత్యలు చేస్తున్నారని, పెద్దపల్లిలో చిన్నారిపై లైంగికదాడి హత్య ఘటన మనసును కలవరపెట్టిందన్నారు. డ్రగ్స్ అనర్థాలపై మెగాస్టార్ చిరంజీవి సందేశంతో కూడిన వీడియో, పాటను మంత్రులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీజీపీ రవి గుప్తా, మాజీ క్రికెటర్ మిథాలీరాజ్, సినీ నటులు సుమన్, తేజా సజ్జా, గాయకుడు రామ్ మిరియాల, అధికారులు పాల్గొన్నారు.

ఐటీఐఆర్ మంజూరు చేసే వరకు మాట్లాడుతూనే ఉంటా

» కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను కలుస్తా

» ప్రతిపక్షంగా మా బాధ్యత మేము నిర్వహిస్తాం

» కాంగ్రెస్ ఐటీఐఆర్ మంజూరు చేసినప్పుడు.. రఘునందన్ రావు బీఆర్ఎస్‌లో ఉన్నడు

» నాకష్టంతోనే నేను ఎదిగా: తూర్పు జగ్గారెడ్డి



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం హైదరాబాద్‌కు ఐటీఐఆర్‌ను మంజూరు చేసే వరకూ దానిపై మాట్లాడుతూనే ఉంటానని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి స్పష్టం చేశారు. పార్లమెంటు సమావేశాలు అయిపోయిన తర్వాత కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం ఇస్తానని, రద్దయిన ఐటీఐఆర్‌ను తిరిగి తీసుకురావాలని కోరతానని వెల్లడించారు. ప్రతిపక్షం తరఫున తమ బాధ్యత నిర్వర్తిస్తామని వెల్లడించారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 14 ఎంపీ సీట్లు కాంగ్రెస్‌కు వచ్చుంటే.. రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యేందుకు అవకాశం ఉండేదేమోనన్నారు. అప్పుడు తామంతా రాహుల్ దగ్గర కూర్చుని హైదరాబాద్‌కు తిరిగి ఐటీఐఆర్‌ను మంజూరు చేయించుకుని ఉండేవాళ్లమని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు సోనియా, మన్మోహన్‌సింగ్ ఇచ్చిన ఐటీఐఆర్‌ను మోదీ ప్రభుత్వం రద్దు చేయకుండా ఉంటే రాష్ట్రంలోని యువతకు ఈ పదేళ్లలో సుమారు 15లక్షల ఉద్యోగాలు వచ్చుండేవన్నారు. ఆ ప్రాజెక్టు అమలై ఉంటే సెజ్‌లు, ఇండస్ట్రియల్ పార్కులు, ట్రేడ్, వేర్ హౌస్ జోన్లు, ఎక్స్‌పోర్టు ఓరియెంటెడ్ యూనిట్లు హైదరాబాద్‌లో విస్తరించి ఉండేవని పేర్కొన్నారు. ప్రభుత్వానికీ పెద్ద ఎత్తున ఆదాయం సమకూరి ఉండేదన్నారు. ఇంత గొప్ప ప్రాజెక్టును ఎన్డీయే ప్రభుత్వం నిలిపేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన 8మంది బీజేపీ ఎంపీలు ప్రత్యేకంగా దృష్టి పెట్టి ఐటీఐఆర్‌ను తిరిగి తెచ్చేందుకు కృషి చేయాలని కోరారు.

నా కష్టంమ్మీద నేను ఎదిగా

"ఐటీఐఆర్ గురించి నాకు అఆలు కూడా తెలియవని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అంటున్నారు. ఎడ్యుకేషన్‌పరంగా నేను వీక్ అయ్యుండొచ్చు. ఇంటర్ ఫెయిల్ అయ్యాను కూడా. రఘునందన్‌రావు పుస్తకాలు చదివితే.. నేను జీవితాన్ని చదివిన. పుస్తకాల్లో ఎవరో రాసింది ఉంటది. మెరిట్ స్టూడెంట్‌కు అనుభవాలు ఉండవు. జీవితాన్ని చదివిన వాడికి కష్టాలు, అనుభవాలు ఉంటయి" అని జగ్గారెడ్డి అన్నారు. తల్లిపాలు తాగి రొమ్ము గుద్దిండంటూ తనపై రఘునందన్‌రావు విమర్శలు చేస్తుండని, కానీ ఇక్కడ తల్లి పాత్రే తన దన్న సంగతి ఆయన తెలుసుకోవాలన్నారు. తన చిన్నతనంలో తమ దగ్గర ఆర్ఎస్ఎస్ శాఖలు నడుస్తుంటే.. పిల్లలమైన తాము గంట సేపు ఆడుకుని ప్రచారక్‌లు ఏదో చెబితే విని వస్తుండేవాళ్లమని చెప్పారు. రఘునందన్‌రావు బీజేపీలోకి డైరెక్టుగా వచ్చిండు కాబట్టి ఆ శాఖల గురించి ఆయనకు తెలియదన్నారు. ఐటీఐఆర్ మంజూరు చేసినప్పుడు ఆయన బీఆర్ఎస్‌లోనే ఉన్నారన్నారు. తన కష్టం మీద, తన తల్లి ప్రోత్సాహంతో తాను ఎదిగానని చెప్పారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేసి జైలుకూ వెళ్లానన్నారు. తన జోలికి వస్తే బీజేపీలో ఉండే కుళ్లు, కుతంత్రాలు చర్చకు పెడతానని హెచ్చరించారు.

ప్రాణాలు తీస్తున్న మద్యం

» 2019లో ప్రపంచ వ్యాప్తంగా 26 లక్షల మరణాలు

» ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మద్యం పానం ప్రజారోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా లక్షల సంఖ్యలో మరణాలకు కారణమవుతోంది. 'గ్లోబల్ స్టేటస్ రిపోర్టు ఆన్ అల్కాహాల్ అండ్ హెల్త్ అండ్ ట్రీట్మెంట్ ఆఫ్ సబ్‌స్టాన్స్ యూజ్ డిజార్డర్' పేరిట ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ఇటీవల విడుదల చేసిన నివేదిక ఈ విషయాన్ని స్పష్టం చేసింది. మద్యం వినియోగానికి సంబంధించి 2019 నాటికి ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల నుంచి సేకరించిన గణాంకాల ఆధారంగా డబ్ల్యూహెచ్‌వో ఈ నివేదిక రూపొందించింది. దీని ప్రకారం 2019 నాటికి ప్రపంచవ్యాప్తంగా 40 కోట్ల మంది అల్కహాల్, మాదక ద్రవ్యాల వినియోగ రుగ్మతతో జీవిస్తున్నారు. వీరిలో 20.9కోట్ల మంది మందుబాబులు ఉన్నారు. మద్యపానం వల్ల కలిగే అనారోగ్యాల వల్ల 2019లో ప్రపంచ వ్యాప్తంగా 26 లక్షల మరణాలు సంభవించాయి. మొత్తం మృతుల్లో 20 లక్షల మంది పురుషులే ఉండడం గమనార్హం. అంతేకాక, మరణించిన వారిలో 20-39 ఏళ్ల లోపు వారే అత్యధికంగా ఉన్నారు. భారత్ విషయానికొస్తే 2019 నాటికి దేశ జనాభాలో 31 శాతం మంది మద్యపానం చేసే వారున్నారు. దేశంలోని పురుషుల్లో 40.9 శాతం మంది, మహిళల్లో 20.8 శాతం మంది మద్యపానం చేసేవారున్నారు. మద్యపానం వల్ల మరణించిన వారి సంఖ్యలోనైతే భారత్ ఏకంగా చైనాను అధిగమించింది. భారత్‌లోని ప్రతీ లక్ష మంది జనాభాలో 38 మంది మద్యం వల్ల మరణిస్తే చైనాలో ఈ సంఖ్య కేవలం 16గా ఉంది. కాగా, మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ప్రపంచవ్యాప్తంగా 2.98 లక్షల మంది మృత్యువాత పడ్డారు. కాగా, 2019 నాటికి ప్రపంచవ్యాప్తంగా తలసరి మద్యం వినియోగం 5.5 లీటర్లు(ఏడాదికి ఒక వ్యక్తి తాగే మద్యం)గా ఉంది. భారత్‌లో ఇది 4.9 లీటర్లుగా ఉండగా 2030 నాటికి అది 6.7 లీటర్లకు చేరనుందని డబ్ల్యూహెచ్‌వో అంచనా వేసింది.

మహిపాల్‌రెడ్డి చూపు.. బీజేపీ వైపు?

కమలం గూటికి చేరనున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే?

» ఈడీ తనిఖీలతో ఆందోళనలో బీఆర్ఎస్ నేత?

» ఢిల్లీకి రహస్య టూర్



పటాన్‌చెరు, జూన్ 26: బీఆర్ఎస్‌కు మరో షాక్ తగలనుందా? పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి బీజేపీలో చేరుతారా? ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జరిపిన తనిఖీల నేపథ్యంలో ఈ నిర్ణయానికి వచ్చారా? అంటే.. మహిపాల్‌రెడ్డి ఆకస్మికంగా ఢిల్లీ పర్యటనకు వెళ్లడంతో ఈ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం జహీరాబాద్ మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు బీబీ పాటిల్‌తో మహిపాల్‌రెడ్డి సమావేశం కావడం కూడా ఆయన బీజేపీ వైపు అడుగులు వేస్తున్నారన్న అభిప్రాయాన్ని కలిగిస్తున్నాయి. అయితే గతంలో బీఆర్ఎస్ తరఫున రెండుసార్లు జహీరాబాద్ ఎంపీగా పనిచేసిన బీబీ పాటిల్‌తో మహిపాల్‌రెడ్డికి సన్నిహిత సబంధాలున్నందున.. ఆ చనువుతో ఆయనను కలిశారనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. కానీ, గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు పటాన్‌చెరు నియోజకవర్గంలో లక్ష పైచిలుకు ఓట్లు సాధించడంతో.. ఓటుబ్యాంకు బీజేపీ వైపు మళ్లిందన్న సంకేతాలు కనిపించాయి. బీఆర్ఎస్ ఏకంగా మూడో స్థానానికి పడిపోవడంతో తమ రాజకీయ భవిష్యత్తు ఏమిటన్న ప్రశ్న స్థానిక బీఆర్ఎస్ నేతల మెదళ్లను తొలుస్తోంది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం ఇదే ఫలితాలు వస్తే కేడర్ మిగలదన్న భావన వ్యక్తమవుతోంది. అయితే ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తొలుత కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరిగినా.. ఈడీ సోదాల తరువాత పరిణామాలు వేగంగా మారిపోయాయి. పటాన్‌చెరు నియోజకవర్గంలో తన ప్రధాన అనుచరులుగా చెప్పుకొనే వారికి సైతం చెప్పకుండా ఆయన ఢిల్లీకి వెళ్లారు. కేవలం కేసు పనిమీద న్యాయవాదులను కలిసేందుకు వెళ్లినట్లు ఆయన అనుచరులు చెబుతున్నా.. బీజేపీ నేత బీబీ పాటిల్‌తో మంతనాలకు సంబంధించి మాత్రం సమాధానం కరువైంది. అంతేకాకుండా బీజేపీ సంగారెడ్డి జిల్లా ముఖ్యనాయకుడు సైతం ఎమ్మెల్యే వెంట వెళ్లడం అనుమానాలు మరింత బలపడేలా చేస్తోంది.


కాంగ్రెస్ చేరేందుకు స్థానికంగా వ్యతిరేకత

మహిపాల్‌రెడ్డి తొలుత కాంగ్రెస్‌లో చేరేందుకే ప్రయత్నాలు చేశారని, కానీ.. ఆయన ప్రయత్నాలను స్థానిక కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గారని సమాచారం. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి రెండో స్థానంలో నిలిచిన నీలం మధు ముదిరాజ్.. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చేరికను వ్యతిరేకించినట్లు తెలిసింది. మరోవైపు మహిపాల్‌రెడ్డి, ఆయన సోదరుడు మధుసూదన్‌రెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు ఇటీవల తనిఖీ చేసి పెద్ద ఎత్తున స్థిరాస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు, నగదును స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతోపాటు బినామీలుగా భావిస్తున్న కొందరిని ఈడీ కార్యాలయానికి పిలిపించి అక్రమాస్తులపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. కిష్టారెడ్డిపేట గ్రామానికి చెందిన ఓ బిల్డర్ మధుసూదన్‌రెడ్డికి బినామీగా వ్యవహరిస్తున్నట్లు ఆధారాలు లభ్యం కావడంతో ఆయన నుంచి వివరణ అడిగారు. మిగతా బినామీ వ్యక్తులు ఈడీ నుంచి తప్పించుకునేందుకు నానా పాట్లు పడుతున్నారని తెలిసింది. ఎవరికి ఎప్పుడు ఈడీ నుంచి పిలుపు వస్తుందో, ఎవరి ఇళ్లలో సోదాలు చేస్తారోనన్న భయంతో వారు బిక్కుబిక్కుమంటున్నారు.

6 నెలల్లో అన్నీ తారుమారవుతాయి

(మొదటి పేజీ తరువాయి)

చూస్తున్నారన్న మాటలు కార్యకర్తల నుంచి వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో ఆయన కేసీఆర్‌ను కలవడంతో ఆ ఊహాగానాలకు తెరపడినట్టేనని కొందరు భావిస్తుండగా, మరికొందరు నాయకులు మాత్రం పార్టీ మారే అవకాశాలను కొట్టిపారేయలేమని వాదిస్తున్నారు. ఐదుగురు ఎమ్మెల్యేలు కేసీఆర్‌ను కలిసి చర్చలు జరిపినప్పుడు మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా ఉన్నట్లు సమాచారం. లక్ష్మారెడ్డి వెంట నియోజకవర్గ నాయకులు తరలివెళ్లారు. నాయకులందరూ కేసీఆర్‌తో ఫొటోలు దిగిన అనంతరం అక్కడే భోజనాలు చేశారు. ఆయనను కలిసిన వారిలో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతామధు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు. వారితో కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు దాదాపు ఐదు గంటల పాటు కేసీఆర్ ఫాంహౌస్‌కు వచ్చిన కార్యకర్తలను కలిశారు.



జర్నలిస్ట్ పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు రాయితీ

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్ 26: జర్నలిస్ట్ పిల్లలకు ప్రవేటు పాఠశాలలో 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ డీఈవో వెంకటేశ్వరచారి బుధవారం ఉత్తర్వులను టీజేఎఫ్ నాయకులకు అందజేశారు. జిల్లాలో వివిధ ప్రైవేటు పాఠశాలలో చదివే జర్నలిస్ట్ పిల్లలకు ఫీజులో రాయతీని కల్పించాలని టీయూడబ్ల్యూజె (టీజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు కల్లోజి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జర్నలిస్ట్ యూనియన్ ప్రతినిధి బృందం జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరచారిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో జర్నలిస్టుల కుటుంబాలు ఎదుర్కొంటున్న ఫీజుల సమస్యను డీఈవోకు వివరించారు. తక్షణమే స్పందించిన జిల్లా విద్యాశాఖ అధికారి జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయతీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసి అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు చంద్ర నరసింహారావు, జిల్లా నాయకులు కొత్త వెంకటేశ్వర్లు, సువర్ణపాక శోభన్‌బాబు, నరసింహారావు, ప్రభాకర్‌రెడ్డి, అబ్రహాం, రామకృష్ణ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను దరిచేరనివ్వం

విద్యార్థులచే ప్రతిజ్ఞ, ర్యాలీ, మానవహారం

భద్రాచలం, జూన్ 26: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం భద్రాచలంలో విద్యార్థులచే మాదక ద్రవ్యాలను దరిచేరనివ్వమని ప్రతిజ్ఞ చేయించారు. ముందుగా జూనియర్ కళాశాల వద్ద ర్యాలీని భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఎం.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. అంబేద్కర్ సెంటర్‌లో విద్యార్థులచే మానవహారం నిర్వహించడంతో పాటు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీఐ సంజీవరావు, ఎస్సైలు పీవీఎన్‌రావు, మధు ప్రసాద్, రెడ్‌క్రాస్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ జాన్‌మిల్టన్, కానిస్టేబుల్ కవి ప్రసాద్, లెక్చరర్ కామేశ్వరరావు, భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.చైతన్య పాల్గొన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ప్రభావాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని భద్రాచలం మైనార్టీ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌లాల్ హట్కర్ పేర్కొన్నారు. భద్రాచలంలో బుధవారం జరిగిన అంతర్జాతీయ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

వ్యసనాలకు గురి కావొద్దు: డీఎస్పీ

ఇల్లెందు టౌన్: వ్యసనాలకు లోనుకాకుండా యువకులు అప్రమత్తంగా ఉండాలని ఇల్లెందు డీఎస్పీ చంద్రబాను హెచ్చరించారు. బుధవారం ఇల్లెందులో పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు.

మాదకద్రవ్యాలను అరికట్టడంలో ముందుండాలి

మాదకద్రవ్యాలను అరికట్టేందుకు విద్యార్థులు కృషి చేయాలని ఇల్లెందు సివిల్‌కోర్టు జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రికరెడ్డి అన్నారు. బుధవారం ఎస్టీ బాలికల ఆశ్రమ పాఠశాలలో మద్యపదార్థాల వినియోగం, దుష్ఫలితాలు, అక్రమ రవాణాలను అరికట్టడంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు భూక్య రవికుమార్‌నాయక్, ప్రధాన కార్యదర్శి ఏ. ఉమామహేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ కీర్తికార్తీక్, ఇల్లెందు ఎస్ఐ సందీప్‌కుమార్, ఆశ్రమ పాఠశాల హెచ్ఎం పద్మ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన తప్పని సరి

చుంచుపల్లి: మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన తప్పని సరిగా ఉండాలని షీ టీమ్ ఇన్‌చార్జ్ రమాదేవి సూచించారు. మండలంలోని ఆనంద్‌ఖని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి: ఎమ్మెల్యే

అశ్వారావుపేట రూరల్: గంజాయి ఇతర మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, కొంతమంది మత్తు పానియాల బారిన పడి బంగారంలాంటి భవిష్యత్తును దూరం చేసుకుంటున్నారని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. అశ్వారావుపేటలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, నాయకులు, పోలీసులు, పట్టణ వాసులు కలిసి అశ్వారావుపేట పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ముందు జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీరాముల శ్రీను, ఆబ్కారీ ఎస్ఐ రాజేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



భద్రాచలంలో ర్యాలీని ప్రారంభిస్తున్న న్యాయమూర్తి

మణుగూరులో..

మణుగూరు: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ దినోత్సవం సందర్భంగా పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్, ఫారెస్ట్ శాఖల ఆధ్వర్యంలో బుధవారం మణుగూరు పట్టణంలో 2కే రన్ నిర్వహించారు. ఈ పరుగులో మణుగూరు సబ్ డివిజన్‌లోని ప్రభుత్వ శాఖల అధికారులు, రాజకీయ పక్షాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎంతో మంది యువత డ్రగ్స్ బారిన పడి మృత్యువాతకు గురికావడమే కాకుండా జీవితాలను ఆగం చేసుకుంటున్నారన్నారు. అనంతరం అందరితో మాధక దవ్యాల నియంత్రణకై ప్రతిజ్ఞ చేయించారు.

జూలూరుపాడులో..

జూలూరుపాడు: మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యులు కావాలని జూలూరుపాడు సీఐ ఇంద్రాసేనారెడ్డి అన్నారు. ప్రపంచ మాదక ద్రవ్యాల దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం జూలూరుపాడులో ర్యాలీ నిర్వహించి మానవహారం కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులు, యువతియువకులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీఐ మాట్లాడారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

సుజాతనగర్: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వినియోగంతో జీవితం అంధకారం అవుతుందని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ధన్వంతరీ ఫార్మసీ కళాశాలలో బుధవారం జరిగిన న్యాయ చైతన్య కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ సి.రాజ్యలక్ష్మి, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడి బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక అకిట్స్ కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.



మాట్లాడుతున్న షీ టీమ్ ఇన్‌చార్జ్ రమాదేవి

డ్రగ్స్‌కు దూరంగా ఉండండి

పాల్వంచ: విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, భవిష్యత్తుకు బంగారుబాటలు వేసుకోవాలని డీఈవో వెంకటేశ్వరచారి పిలుపునిచ్చారు. బుధవారం అంతర్జాతీయ డ్రగ్స్ నివారణ దినోత్సవ ర్యాలీని పాల్వంచ పట్టణ పరిధిలోని కొమ్ముగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రాంభించారు. కొమ్ముగూడెం ప్రధాన కూడలిలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన మానవహారంలో పాల్గొని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు, భావితరాలకు ఆదర్శంగా నిలవాలని అన్నారు.



మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి

ఢిల్లీలో ఉండటం వల్ల రాలేకపోతున్నా..

ఎమ్మెల్యే 'పాయం'ను ఫోన్‌లో పరామర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి


'పాయం'ను పరామర్శిస్తున్న మంత్రి తుమ్మల

మణుగూరు, జూన్ 26: పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాతృమూర్తి రాములమ్మ ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా ఎమ్మెల్యే పాయంను పరామర్శించేందుకు గురువారం సీఎం రేవంత్‌రెడ్డి మణుగూరులో పర్యటిస్తారనే వార్తలు గుప్పుమన్నాయి. అయితే సీఎం రేవంత్ రెడ్డి బుధవారం మధ్యాహ్నం తనతో మాట్లాడినట్లు ఎమ్మెల్యే తెలిపారు. తన తల్లి మృతి చెందిన విషయాలను తెలుసుకున్న సీఎం ఫోన్ ద్వారా పరామర్శించారని తెలిపారు. తాను ఢిల్లీలో ఉండటం వల్ల రాలేకపోతున్నానని సీఎం చెప్పారన్నారు. గురువారం మణుగూరులో జరిగే పాయం వెంకటేశ్వర్లు మాతృమూర్తి దశదిన కర్మ కార్యక్రమాలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కొమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క తదితరులు హాజరు కాబోతున్నారు.

మంత్రి తుమ్మల పరామర్శ

మణుగూరుటౌన్: పాయం వెంకటేశ్వర్లును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం పరామర్శించారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నివాసంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే తల్లి రాములమ్మ చిత్రపటం వద్ద నివాళ్లు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే పాయంతో కాసేపు గురువారం జరగబోయే కర్మల కార్యక్రమంపై చర్చించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం పద్మశ్రీ సకిని రామచంద్రయ్య కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు కూనవరం గ్రామం తరలివెళ్లారు.

భారీగా నాయకులు, కార్యకర్తలు..

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును పరామర్శించేందుకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మణుగూరుకు వస్తున్నారన్న సమాచారం తెలియడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తుమ్మల అభిమానులు ఎమ్మెల్యే నివాసం వద్దకు పెద్దఎత్తున చేరుకున్నారు. మంత్రి తుమ్మలను ఎమ్మెల్యేతో పాటు నాయకులు, కార్యకర్తలు , సింగరేణి ఐఎన్‌టీయూసీ నాయకులు స్వాగతం పలికి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, జిల్లా మహిళా నాయకురాలు దేవీ ప్రసన్న, నాయకులు పీరినాకి నవీన్, కేవీ రావు, ఎంపీపీ ముత్తినేని సుజాత, గుఫూడి కోటేశ్వరరావు, సింగరేణి మణుగూరు ఏరియా ప్రాతినిధ్య సంఘం నాయకులు వత్సవాయి కృష్ణం రాజు, గట్టయ్య, సామా శ్రీనివాసరెడ్డి, నాయకులు వెంకటప్పయ్య, బాబు, వెంకన్న, వాసు, కృష్ణార్జున్, సుబ్బారెడ్డి, తిరుమలేష్, శ్రీనివాస్, బల్లెం సురేష్, హరి, కంది సుబ్బారెడ్డి, వరలక్ష్మీ, గాజుల రమ్య, కొర్సా ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన జిల్లా వైద్యాధికారి


అధికారులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి భాస్కర్ నాయక్

అశ్వాపురం జూన్ 26: అశ్వాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం జిల్లా వైద్యాధికారి భాస్కర్‌నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఓపీ ల్యాబ్, మందుల నిల్వలు, రిజిస్టర్లను, ఆసుపత్రిలో నోటీస్ బోర్డుల ఏర్పాటును తనిఖీ చేశారు. రోగుల వార్డులు, ప్రసవాల గది, ఆసుపత్రిలో పరిశుభ్రత, గర్భిణులకు అందిస్తున్న వైద్యసేవల గురించి మండల వైద్యాధికారి సంకీర్తనను అడిగితెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ పారామెడికల్ అధికారి శ్రీనివాసరావు, డీఐవో బాలాజీ నాయక్, వైద్యాధికారి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు ఉంటే తెలియచేయాలి


మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య

జూలూరుపాడు, జూన్ 26: సీతారామ లింగ్‌కెనాల్‌నిర్మాణంతో భూములు కోల్పోయిన నిర్వాసితులు అభ్యంతరాలు ఉంటే తెలియచేయాలని స్పెషల్ డిప్యూటి కలెక్టర్ కాశయ్య కోరారు. బుధవారం ఆయన మండలంలోని జూలూరుపాడు, వినోభానగర్ గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాల్లో భూ నిర్వాసితులకు గ్రామసభల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఏమైన అభ్యంతరాలు ఉంటే వెంటనే తెలియచేయాలన్నారు.

భద్రాద్రి రక్షణకు చర్యలు చేపట్టాలి

భద్రాచలం, జూన్ 26: గోదావరి వరద ముంపు నుంచి భద్రాచలం పట్టణ రక్షణకు శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు, నియోజకవర్గ కన్వీనరు మచ్చా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం బృందం బుధవారం కరకట్ట పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సమయంలో గోదావరి వరదలపై జిల్లా మంత్రుల పర్యటన సందర్భంగా వరదల సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిసింది. ఈ సమావేశంలో భద్రాచలంకు శాశ్వత ప్రాతిపదికన నిర్దిష్టమైన ప్రణాళికలు, ప్రకటన చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న పాత కరకట్టను ఎత్తు పెంచి దాన్ని పొడిగించాలని స్లూయిజ్‌లు లీకవడంతో పట్టణంలోకి గోదావరి వరద నీరు రావడంతో కాలనీలు ముంపునకు గురవుతున్నాయని, మరో పక్క పట్టణంలోని డ్రైనేజీ నీటితో కొన్ని ప్రాంతాలు ముంపుకు గురవుతున్నాయని ఈ సమస్య ఉత్పన్నం కాకుండా పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు స్లూయిస్‌లు పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేయాలన్నారు. భారీ మోటార్లను ముందస్తుగానే ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంబీ నర్సారెడ్డి, గడ్డం స్వామి, బండారు శరత్‌బాబు, వై.వెంకటరామారావు, బీబీజీ తిలక్ పాల్గొన్నార. ఇదిలా ఉండగా మనుబోతుల చెరువు కాలనీలో జరిగిన మరో సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి మాట్లాడుడూ ఆసర పెన్షన్లు వెంటనే లబ్దిదారుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు.


కరకట్ట పనులను పరిశీలిస్తున్న సీపీఎం బృందం

వేదపాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

దుమ్ముగూడెం జూన్ 26:నరసాపురం చినఅరుణాచలం శ్రీ వాల్మీకి వేద సంస్కృత పాఠశాలలో విద్యాభ్యాసానికై జూలై 11 వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు శివనాగస్వామి బుధవారం తెలిపారు. అడ్మిషన్ పొందిన వారికి ఉచిత వసతి, భోజనం, విద్యను అందిస్తామన్నారు. అడ్మిషన్లకు 9908229103З నెంబర్లో సంప్రదించాలని కోరారు.

విద్యుత్, ఇంధనాన్ని పొదుపు చేయాలి

ఇల్లెందు టౌన్, జూన్ 26: సింగరేణి ఉద్యోగులు విద్యుత్, ఇంధనాన్ని పొదుపు చేయాలని ఏరియా జీఎం జాన్‌ఆనంద్ పిలుపునిచ్చారు. బుధవారం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు గాలి, వెలుతురు ఇంట్లో వచ్చేవిధంగా ఇంటి కిటికీలు తెరిచి ఉంచాలని కోరారు. ఎల్ఈడీ ట్యూబ్‌లు, ఎల్ఈడీ బల్బులు మాత్రమే వాడాలన్నారు. వాటర్ హీటర్లు, మోటార్లు వాడటం పూర్తిగా నిషేధించాలని తెలిపారు. అవసరం లేని చోట్ల లైట్లు, ఫ్యాన్లు, టెలివిజన్ వంటి వాటిని తగ్గించుకోవాలన్నారు. అదేవిధంగా డీజిల్, పెట్రోల్ వంటి ఇంధనాలపై ఆధారపడటం తగ్గించుకుని పర్యావరణ కాలుష్యంతోపాటు గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించుకోవాలన్నారు. అక్రమ విద్యుత్ వినియోగించుకుండా ఉండాలని కోరారు. సింగరేణి ప్రగతికి ప్రతిఉద్యోగి తోడ్పడేవిధంగా కృషి చేయాలన్నారు.

ద్వి చక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

దమ్మపేట, జూన్ 26: రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొని ఇద్దరు గాయపడిన ఘటన బుధవారం రాత్రి దమ్మపేట మండలంలోని ఆసన్నగూడెంలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దమ్మపేట మండలం తొట్టిపంపు గ్రామానికి చెందిన కారం భాస్కరరావు, ఆంధ్రాలోని చింతలపూడి మండలం గురుభట్లగూడెం గ్రామానికి చెందిన మేడి రాంప్రసాదుల వాహనాలు ఢీకొన్నాయి. గాయపడ్డ వారిద్దరినీ 108లో సత్తుపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స నిర్వహించారు. భాస్కరరావు పరిస్థితి ఆందోళకరంగా వుండటంతో మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించినట్లు సమాచారం

ఆరోపణలు అర్ధరహితం

టెరిటోరియల్ ఎఫ్‌డీవో దామోదర్‌రెడ్డి

పాల్వంచ, జూన్ 26: గత వారం రోజులుగా వివిధ మాధ్యమాల్లో ఫారెస్ట్ అధికారులపై వస్తున్న ఆరోపణలు అర్ధరహితమని పాల్వంచ టెరిటోరియల్ ఎఫ్‌డీవో దామోదర్‌రెడ్డి అన్నారు. బుధవారం పాల్వంచ టెరిటోరియల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సిబ్బంది సీజ్ చేసిన ఇసుక లారీపై కేసు లేకుండా చేసి పంపించాలని మణుగూరుకు చెందిన వ్యక్తి తనపై ఒత్తిడి తెచ్చాడని తెలిపారు. అందుకు తాను నిరాకరించడంతో తనపై, తన సిబ్బందిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని అన్నారు. తాము సీజ్ చేసిన లారీ ఈ నెల 16న రెండు ట్రిప్పులు వేయడం సీసీ పుటేజీలో స్పష్టంగా ఉందని తెలిపారు. దానికి తోడు తాము మైనింగ్‌శాఖను పర్మిట్ వివరాలు పంపమని కోరామని, దానికి స్పందిస్తూ మైనింగ్‌శాఖ వారు తమకు నివేదిక పంపారని వివరిం చారు. ఆ నివేదికలో సదరు లారీకి 16తేదీన ఒకసారి మాత్రమే పర్మిట్ ఇచ్చామని స్పష్టం చేసారని వివరించారు. సదరు ఇసుక కాంట్రాక్టర్ వారి తప్పులను కప్పిపుచ్చుకోవడానికి త మకు లీగల్ నోటీసులు పంపారని, అటువంటి వాటికి న్యాయపరంగానే బదులిస్తామని అన్నారు. వీటన్నింటినీ పరిశీలించి మీడియా వాస్తవాలను మాత్రమే పరిగణలోకి తీసుకుని ప్రజలకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.


మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

ప్రైవేటీకరణను రద్దుచేయాలి

కొత్తగూడెం టౌన్, జూన్ 26: కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాక్‌ల ప్రైవేటీకరణను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తగూడెం బస్టాండ్ సెంటరులోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు లిక్కి బాలరాజు మాట్లాడుతూ సింగరేణి సంస్థ బొగ్గుబ్లాక్‌లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ వ్యక్తుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను దీవాళా తీయిస్తుందని ఆరోపించారు. సింగరేణికే బొగ్గుబ్లాక్‌లను కేటాయించాలని ఆయన డిమాండ్ చశారు.

ట్రాఫిక్ నిబంధనలను సులభతరం చేయండి

పాల్వంచ, జూన్ 26: పాల్వంచలో ట్రాఫిక్ నిబంధనలను సులభతరం చేయాలని డీసీఎంఎస్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు కొత్వాల శ్రీనివాసరావు కోరారు. బుధవారం కాంగ్రెస్ శ్రేణులను వెంటబెట్టుకుని పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ ఏరియా ఎక్కువగా వ్యాపార సముదాయాలుండే ప్రాంతమని, నిత్యం రద్దీగా ఉంటుందని, వాహనాలు నిలపడానికి కూడా స్థలం ఉండదని అటువంటి ప్రాంతంలో పోలీస్‌వారు ఫోటోలు తీసి ఫైన్‌లు వేస్తున్నారని అన్నారు. పాల్వంచలోని జాతీయ రహదారిపై సైతం అకారణంగా ఫోటోలు తీసి ఫైన్‌లు వేస్తున్నారని, తద్వారా ఒకేరోజు పలుసార్లు జాతీయరహదారిపై ప్రయాణించే ప్రయాణికులకు ఇబ్బందిగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండం వెంకన్న, బద్ది కిషోర్, సాధం రామకృష్ణ, కాల్వ భాస్కర్, చింతా నాగరాజు, కాపర్తి వెంకటాచారి, కందుకూరి రాము, చాంద్‌పాషా, ఒలపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కొండ కోనలు దాటి వైద్యం

ఆళ్లపల్లి, జూన్ 26: ఆళ్లపల్లి మండలం, పెద్దవెంకటాపురం పంచాయతీలోని రహదారి లేని అత్యంత మారుమూల గ్రామమైన బూసురాయిని బుధవారం ఆళ్లపల్లి పీహెచ్‌సీ వైద్యులు, మండల పరిషత్, పోలీస్ అధికారులు కొండ కోనలు, వాగులు, దాటుకుంటూ ట్రాక్టర్, ద్విచక్రవాహనలపై వెళ్లి గ్రామాన్ని సందర్శించారు. ఆళ్లపల్లి పీహెచ్‌సీ వైద్యుడు రేవంత్ ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామస్తులను పరిక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఆళ్లపల్లి ఇన్‌చార్జ్ ఎంపీడీవో బత్తిని శ్రీనివాసరావు పంచాయతీ కార్మికులతో కలిసి గ్రామాంలో పారిశుధ్య పనులు చేపట్టి గ్రామాన్ని పరిశుభ్రం చేశారు. అనంతరం ఆళ్లపల్లి ఎంపీపీ కొంద్రు మంజుభార్గవి మాట్లాడుతూ.. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంతో వర్షకాలంలో వచ్చి వ్యాదులను ఎదుర్కోనవచ్చన్నారు. జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలు వస్తే తక్షణం వైద్యులను సంప్రదించాలన్నారు.మీ గ్రామానికి ఏదైన సమస్య వస్తే మీ గ్రామానికి వస్తున్న అధికారుల ద్వారా మండల అధికారులు తెలియజేస్తే వారు సమస్య పరిష్కరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి సీఐ సురేష్, ఎస్ఐ రతీష్, పీహెచ్‌సీ వైద్యురాలు సంగమిత్ర, స్టాఫ్‌నర్స్ సమ్మక్క పాల్గొన్నారు.

బీజేపీకి చుక్కలు చూపించిన రైతులు

భద్రాచలం, జూన్ 26: రైతులపై విచక్షణ రహితంగా విరుచుకుపడ్డ బీజేపీకి దేశంలో రైతులు చుక్కలు చూపించారని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా అన్నారు. జూలై 8న దుమ్ముగూడెం మండలం గంగోలులో నిర్వహించే రైతు సంఘం జిల్లా రెండో మహాసభ సన్నాహాక సమావేశం బుధవారం సీపీఐ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సాబీర్‌పాషా మాట్లాడుతూ బీజేపీ దేశంలో ఇష్టానుసారంగా పరిపాలన సాగించిందని, దేశానికి వెన్నుముక అయిన రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందని అన్నారు. రైతులు నెత్తిమీదకి నల్ల చట్టాలను తీసుకొచ్చి వారి మనుగడని తుడిచిపెట్టేందుకు ప్రయత్నం చేసిందని, హక్కుల పరిరక్షణ కోసం పోరాటం చేస్తున్న రైతులను ఢిల్లీ కేంద్రంగా హింసకు గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఏపూరి బ్రహ్మం, కల్లూరి వెంకటేశ్వరరావు, రావులపల్లి రవికుమార్, కిలిమి ఎల్లారెడ్డి, మందపాటి సుధాకర్‌రెడ్డి, చిరుమామిడి వెంకటేశ్వర్లు, పాల్వంచ రామారావు, నూక తిరుపతి పాల్గొన్నారు. అలాగే గ్రామీణ ఆటో డ్రైవర్స్ అసోసియేషన్ సమావేశంలో సాబీర్‌పాషా మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఇక్కడ జీవనం సాగిస్తున్న ఆటో కార్మికులు బతుకు దెరువు కోల్పోతారని చెప్పారు. సులభ్ కాంప్లెక్సుని ఆర్టీసీ లోపల భాగంలో నిర్మించుకోవచ్చని దీనిని అధికారులు పరిశీలన చేయాలని కోరారు.



మాట్లాడుతున్న సాబీర్ పాషా

ఐఎన్‌టీయూసీ విజయం

రుద్రంపూర్, (సింగరేణి) జూన్ 26: సింగరేణి కొత్తగూడెం ఏరియా వర్క్‌షాపు క్రెడిట్ సొసైటీ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ విజయం సాధించింది. బుధవారం కొత్తగూడెం ఏరియా క్రెడిట్ సొసైటీల ఏడు డైరెక్టర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా ఆరు డైరెక్టర్ స్థానాలను ఐఎన్‌టీయూసీ నాయకులు సొంతం చేసుకున్నారు. డైరెక్టర్లుగా సంగ వీర, మింగాని అశోక్, శ్రీకాంత్ శర్మ, బాబుద్దీన్, రాంచందర్‌రావు, పద్మావతి విజయం సాధించగా ఎఐటీయూసీకి చెందిన గౌరీవర ప్రసాద్‌లు విజయం సాధించారు. విజయం సాధించిన డైరెక్టర్లను ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి ఐఎన్‌టీయూసీ పని చేస్తుందని తెలిపారు. నమ్మకంగా ఓట్లు వేసి గెలిపించిన కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయం సాధిస్తామని ఆయన తెలిపారు.